

అద్భుతః

- అమరావతి చిత్రకళ వీధి ప్రదర్శన
- వందలాది పెయింటింగ్స్ ఆకృతులు
- పెన్సిల్ ఆర్ట్ నుంచి సిలికాన్ విగ్రహాల వరకూ
- పలు రాష్ట్రాల నుంచి కళాకారులు
- కళలకు పునరుజ్జీవం : డిప్యూటీ స్పీకర్ రఘురామ
- కళాకారులకు పూర్వ వైభవం : మంత్రి దుర్గేష్

కళాకారుల సృజనాత్మకత కుంచెగా మారి జాలువారిన చిత్రాలు, ఆలోచనలకు రూపమిచ్చిన ఆకృతులతో, ఒడుపుగా రావి ఆకులో ఇమిడ్చిన స్వతంత్ర సమరయోధుల చిత్రాలు, కోడిగుడ్డు గుల్లలు, వేరుశనగ తొక్కలు.. ఇలా ఒకటేమిటి.. ఎన్నెన్నో వస్తువులతో జీవం పోసుకున్న కళారూపాలు.. మొత్తంగా అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఔరా! అనిపించింది. గోదావరి తీర నగరాన్ని పులకింపజేసింది. కళకు కాదేదీ అనర్హం అని నిరూపించింది. కళాకారులకు పూర్వ వైభవం తీసుకొచ్చే సదుద్దేశంతో రాష్ట్ర సాంస్కృతిక శాఖ రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేసిన ఈ వేడుకలో కళాకారులు తమ కళాఖండాలను ప్రదర్శించారు. 6



ఇటీవల తాము వేసిన వేషధారణలతో వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న రఘురామకృష్ణంరాజు, దుర్గేష్, పక్కన ఎమ్మెల్యే ఆదిరెడ్డి, తేజస్వి



రాజమహేంద్రవరంలో.. చిత్రకళా వీధిలో..



అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల, కలెక్టర్, ఎస్పీ తదితరులు





చిత్రకళా వీధిలో ప్రదర్శనలు.. సెంట్రల్ జైలు స్టాల్ వద్ద స్వాగతం







తన రక్తంతో గీసిన పవన్ చిత్రాన్ని రఘురామకు చూపిస్తున్న ఆర్టిస్ట్



కళ.. కళాకారులు

అయ్యో.. రొయ్యో..!





ఆక్వా చెరువులు... వనామీ రొయ్యలు పడుతున్న దృశ్యం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్వా రైతుల్లో వణుకు పుట్టిస్తున్నాడు. భారత్ సహా వివిధ దేశాల నుంచి అమెరికాకు ఎగుమతి సుంకాలు భారీగా పెంచుతున్నట్టు చేసిన ప్రకటనతో రొయ్యల ఎగుమతిదారులు కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. దాని ఫలితంగా ఆక్వా రైతులు పండించే ఉత్పత్తులపై తీవ్రమైన ప్రభావం పడింది. ఉత్పత్తి అయ్యే రొయ్యలను సైతం ఎగుమతిదారులు ధరలు తగ్గించి కొనుగోలు చేసే ప్రతిపాదనలు రైతులకు శరాఘాతంగా మారింది. ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఎగుమతి సుంకాలు పెంచేశారన్న ప్రచారం ప్రభావంతో భారత్‌లోనే అత్యధిక ఆక్వా ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోళ్లు నిలిపివేయడం వల్ల ధరలు గణనీయంగా తగ్గిపోయి రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. 50 కౌంట్ నుంచే అమెరికాకు రొయ్యల ఉత్పత్తుల ఎగుమతులు జరుగుతుంటాయి. అయితే దీన్ని సాకుగా తీసుకుని వంద కౌంట్ రొయ్యల ధరను భారీగా తగ్గించేశారు. కొన్ని రోజులపాటు ఆక్వా రైతులు, ఉత్పత్తులను పట్టుబడులు చేయడం నిలిపివేయాలంటూ కంపెనీలు ఆదేశించడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. అమెరికా సుంకాల భారాన్ని మోపడంపై వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

(అమలాపురం/మలికిపురం-ఆంధ్రజ్యోతి)

భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ముఖ్యంగా వనామీ రొయ్యపై ఎగుమతి సుంకం విధించడంతో ఆక్వా రైతులు పండించే రొయ్యల ఉత్పత్తులను కొన్నిరోజులపాటు నిలిపివేయాలన్న ఎగుమతిదారుల నిర్ణయం రైతులకు తీవ్ర ఆందోళన కలిగించింది. దాంతో కిలో రొయ్యలకు రూ.40 వరకు ఎగుమతి సుంకం పడుతుందనే పేరుతో రొయ్యల కొనుగోళ్లు నిలిపివేశారు. ఏప్రిల్ 15 నుంచి రొయ్యల ధరలు మరింత తగ్గుతాయనే ప్రచారానికి తెర లేపారు. దాంతో రొయ్యల రైతులు ఉత్పత్తి అయిన వాటిని అయిన కాడికి అమ్ముకోవడానికి సిద్ధమయ్యారు. వ్యాపారులు మాత్రం సిండికేట్ అయి నోరు మెదపడం లేదు. ఆర్డర్లు చెప్పడం లేదు. దాంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. అధిక సాగు ఉన్న కోనసీమలో తీరప్రాంత మండలాల నుంచి ప్రతీ రోజు వేలాది టన్నుల రొయ్యలు వివిధ కంపెనీలకు ఎగుమతి అవతాయి. రాష్ట్రంలోనే పేరొందిన ప్రముఖ కంపెనీలు ఈ ప్రాంతం నుంచి రొయ్యల కొనుగోలు చేస్తాయి. ట్రంప్ పేరుతో తమపై ఎగుమతి సుంకం పడుతుందనే నెపంతో ఎగుమతిదారులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని, ప్రస్తుతానికి కొనుగోలు నిలిపివేసినట్టు చెబుతున్నారు. ప్రస్తుతానికి కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు తగ్గించి రొయ్యలు కొనుగోలు చేస్తున్నారు. ధరలు మరింత తగ్గుతాయని ప్రచారం చేస్తూ రైతులను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. 30 నుంచి 50 పైకౌంటు రొయ్యలు మాత్రమే అమెరికా, జపాన్ వంటి ఇతర దేశాలకు ఎక్కువగా ఎగుమతులు అవుతాయి. అయితే 80 నుంచి వంద కౌంటు వరకు రొయ్యలు ఎగుమతులకు పనికిరావని సాకుచూపి రేటు భారీగా తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వంద కౌంటు రొయ్యలు రూ.220 ధరకు కొనుగోలు చేస్తుండగా, 90 కౌంట్ రూ.230, 80 కౌంట్ రూ.250, 70 కౌంట్ రూ.270, 60 కౌంట్ రూ.300, 50 కౌంట్ రూ.330, 40 కౌంట్ రూ.360, 30కౌంట్ రూ.450 ధరలు ఉండగా ఇవి మరింత దిగజారే అవకాశాలు ఉన్నాయని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం రొయ్యల రైతులకు భరోసా కల్పించాలని, అత్యధిక విదేశీ మారకద్రవ్యం ఆర్జించే పెద్ద రంగం ఆక్వా కాబట్టి ప్రభుత్వం ఆక్వా రైతులకు బాసటగా నిలబడాలని ఆక్వా అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు త్సవటపల్లి నాగభూషణం పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తామన్న విద్యుత్ రాయితీలు వర్తింపచేయాలని, గత ప్రభుత్వంలో దారుణంగా పెంచిన రొయ్య పీడు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కొనుగోలుదారులతో చర్చించి రొయ్యలు కొనే ఏర్పాట్లు చేయాలని కోరారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆక్వా రైతుల్లోనూ ఇదే ఆందోళన నెలకొంది.

- ఆక్వా రంగంలో వణుకు పుట్టిస్తున్న ట్రంప్ ప్రకటన
- ఆక్వా రైతు నెత్తిన ఎగుమతి సుంకం పిడుగు
- ఆ సాకుతో రొయ్యల కొనుగోళ్లు ఆపేసిన ఎగుమతిదారులు
- కొన్ని రోజులపాటు కొనుగోళ్లు నిలిపివేయాలని నిర్ణయం
- విలవిల్లాడుతున్న రైతులు

జనసేనదే నిడదవోలు మున్సిపాలిటీ!

వైసీపీ కౌన్సిలర్ల వలసబాటతో మారిన సీను



జనసేన పార్టీలో చేరిన కౌన్సిలర్లతో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్టమొదటి మున్సిపల్ కౌన్సిల్ జనసేన ఖాతాలో పడనుంది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పురపాలక సంఘంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో జనసేన బలం అనూహ్యంగా పెరగడంతో ఇక ఆ పార్టీ కౌన్సిల్‌ను చేజిక్కించుకోవడమే మిగిలింది. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిడదవోలు పట్టణంలోని 28 వార్డులకు సంబంధించి 27 వార్డులను వైసీపీ కైవసం చేసుకోగా, ఒకేఒక వార్డులో తెలుగుదేశం గెలిచింది. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, మరో 11 మంది కౌన్సిలర్లు ఇప్పటిదాకా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో జనసేన కండువా కప్పుకున్నారు. నిజానికి ఈనెల 18వ తేదీకి నాలుగేళ్ల పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో కౌన్సిల్‌లో తమ బలాన్ని నిరూపించుకునేందుకు చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ గంగుల వెంకటలక్ష్మిలపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అనుమతి ఇవ్వవలసినదిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితలకు వైసీపీ కౌన్సిలర్లు పలువురు వినతిపత్రం అందించారు. కానీ ఈలోపు రాజకీయ పరిణామాలు మారిపోయాయి. వైసీపీ కౌన్సిలర్లు జనసేనలో వలసబాట పట్టారు. చైర్మన్, వైస్ చైర్మన్ తోపాటు 11 మంది చెందిన కౌన్సిలర్లు జనసేనలో చేరిపోయారు. దీంతో జనసేన బలం 13 మందికాగా, టీడీపీ కౌన్సిలర్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కందుల దుర్గేష్‌కు కౌన్సిల్‌లో ఓటు ఉండడంతో కూటమి బలం 15కు చేరింది. వైసీపీ కౌన్సిలర్ల వినతి మేరకు దీంతో ఈనెల 20వ తేదీన అవిశ్వాసం ప్రవేశపెట్టాల్సి ఉండగా, తాజా పరిణామాలతో ఈ అవకాశం లేనట్టుగా భావిస్తున్నారు. ఈలోపు తమ బలం నిరూపించుకునేందుకు జనసేన సన్నద్ధమవుతున్నట్టు సమాచారం.

వేడెక్కిన కౌన్సిల్ రాజకీయం

నిడదవోలు పురపాలక సంఘ కౌన్సిల్‌లో చైర్మన్ పదవిని వైసీపీ కైవసం చేసుకోవాలని రంగం సిద్ధంచేయగా, అవిశ్వాసాన్ని వీగిపోయేలా చేసేందుకు జనసేన పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. ఈ నేపథ్యంలో మొదటిగా చైర్మన్‌తోపాటు తొమ్మిది మంది కౌన్సిలర్లు జనసేనలోకి చేరగా, గత సోమవారం ఇద్దరు కౌన్సిలర్లు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. గురువారం మరో కౌన్సిలర్ జనసేన తీర్థం తీసుకోగా జనసేన బలం 12కు చేరుకుంది. శుక్రవారం మరో వైకాపా కౌన్సిలర్ ఆరుగొల్లు వెంకటేశ్వర్లు జనసేనలో చేరడంతో 13కు జనసేన బలానికి మరో టీడీపీ కౌన్సిలర్‌తో కలిపి 14కు చేరింది. మంత్రి దుర్గేష్‌కు కౌన్సిల్‌లో ఓటు హక్కు ఉండడంతో జనసేన బలం 15కు చేరుకుంది. దీంతో వైకాపా అవిశ్వాస తీర్మానానికి కూడా అర్హత లేకుండాపోయిందని సమాచారం.

ఆ ఇద్దరిదే వ్యూహం..

నిడదవోలు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ తోపరాల కళ్యాణ్‌చక్రవర్తి శింగవరం గ్రామానికి చెందిన పెన్మెత్స చందులు ప్రధానంగా మున్సిపల్ రాజకీయంలో చక్రంతిప్పారు. నిడదవోలు నియోజకవర్గంలోను, పట్టణంలోను జనసేనను బలోపేతం చేసే దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేసి జనసేన కౌన్సిల్ సాధించేలా విజయవంతంగా కథ నడిపించారు. ఇప్పటికే జనసేన పార్టీ నాయకుడిగా డాక్టర్ కళ్యాణ్ సేవలందిస్తుండగా, వైకాపాకు అన్ని విధాల అండగా ఉంటూ వచ్చిన పెన్మెత్స చందు మంత్రి దుర్గేష్ సమక్షంలో జనసేన తీర్థం తీసుకున్నారు. మున్సిపల్ వ్యవహారంలో వీరిద్దరినీ మంత్రి దుర్గేష్ అభినందించారు.



అఖండ గోదావరి ప్రాజెక్టు నేపథ్యంలో గోదావరి నదీ తీర ప్రాంతాల్లో, హేవలాక్ బ్రిడ్జి, బ్రిడ్జి లంక ప్రాంతాల్లో మంత్రి కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ ప్రశాంతి, మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ తదితరులు పర్యటించి పరిశీలన చేశారు.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం

రబీ ధాన్యం సేకరణకు నేటి నుంచి రైతు సేవా కేంద్రాలు : జేసీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): 2024-25 రబీ ధాన్యం సేకరణకు ఏప్రిల్ 5 నుంచి 216 రైతు సేవా కేంద్రాలు ప్రారంభిస్తున్నామని జేసీ చిన్నరాముడు తెలిపారు. 2 లక్షల టన్నులు వరి సేకరణ లక్ష్యమన్నారు. రైతులు తమ ధాన్యాన్ని 17శాతం తేమ వరకూ ఆరబెట్టుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని తమకు నచ్చిన మిల్లుకు పంపించే వెసులుబాటు ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంపై ఫిర్యాదులు, సందేహాలను తెలియజేయడానికి కంట్రోల్‌రూం ఏర్పాటుచేశామని, సెల్ నెం.8309487151లో సంప్రదించవచ్చని జేసీ తెలియజేశారు.

మృత్యువుతో పోరాడి.. 7

- కిమ్స్ బొల్లినేని ఉద్యోగి లైంగిక వేధింపులతో ఫార్మాసిస్ట్ నాగాంజలి ఆత్మహత్యాయత్నం
- 13 రోజులపాటు చికిత్స పొందుతూ చివరకు కన్నుమూత

మాజీ ఎంపీ హర్షకుమార్‌పై కేసు నమోదు 12

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్



సమీక్షలో మాట్లాడుతున్న అజయ్ జైన్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్ నెం.9552300009పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై వారితో మాట్లాడి సంతృప్తి చెందే విధంగా చర్యలు ఉండాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జోనల్ ప్రత్యేక అధికారి అజయ్‌జైన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ప్రగతి, ప్రభుత్వ ప్రాధాన్యతలు, అమలులో సమస్యల పరిష్కారం, వ్యవసాయం, ప్రకృతి సాగు, పీఎం సూర్యఘర్, హౌసింగ్, పీఎం విశ్వకర్మ, ఎక్సైజ్, జీఎస్టీ, మునిసిపల్, పంచాయతీ రాజ్, పర్యాటకం తదితర అంశాలపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసే క్రమంలో క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకొని, వాస్తవ పరిస్థితికి అనుగుణంగా చర్యలు తీసుకున్నప్పుడే లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టిసారించడంతోపాటు సమస్యలు ఎదురైతే పరిష్కారాలు సూచించాలన్నారు. పర్యాటకపరంగా తూర్పుగోదావరిలో హోటల్స్ నిర్మాణాన్ని ప్రోత్సహించే క్రమంలో ఆసక్తి కలిగిన వారిని గుర్తించాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో 5వేల హోటల్ గదులు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందన్నారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచడంలో వాస్తవ పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యమన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 15శాతం జీవీఏ అభివృద్ధి దిశగా ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. వ్యవసాయ రంగంలో అంతర పంటలను, జిల్లాలో 47వేల ఎకరాల వరకూ ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ చిన్న రాముడు, మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.





అద్భుతః




అర్ట్‌ని తిలకిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

'అమరావతి చిత్రకళా వీధి'లో ఆకట్టుకున్న వందలాది పెయింటింగ్స్, ఆకృతులు

పెన్సిల్ అర్ట్ నుంచి సిలికాన్ విగ్రహాల వరకు... చూసి ముగ్ధులైన ప్రజలు

రాజమహేంద్రవరం/సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన 'అమరావతి చిత్రకళా వీధి' ప్రదర్శనకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నుంచి కూడా కళాకారులు వచ్చారు. నగర కళాకారులతో పాటు కడప, శ్రీకాకుళం, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల వారు పెయింటింగ్స్, ఆకృతులను స్టాల్స్‌లో ఉంచారు. ప్రభుత్వాస్పత్రి దగ్గరనుంచి ఆర్ట్స్ కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్స్ ఎక్రిలిక్, వాటర్ కలర్, పెన్, పెన్సిల్, నిబ్ పెయింటింగ్స్, చెక్క, మట్టి, కాగితం, వాల్‌పుట్టీ తదితర ముడిసరుకులతో చేసిన బొమ్మలతో నిండిపోయాయి.

చిరుధాన్యాలతో చేసిన ప్రధాని మోదీ, తిరుమల వేంకటేశ్వరుని చిత్రపటాలు, మనిషిని పోలిన మనిషి విగ్రహాలు ఆశ్చర్యపరిచాయి. మహిళా ప్రత్యేక కారాగారంలోని ఉత్పత్తులు, కేంద్ర కారాగారంలోని ఖైదీలు వేసిన గాంధీజీ తదితర పెయింటింగ్స్ ఆకర్షించాయి. కడపకు చెందిన ఈరయ్య యోగి వేమన యూనివర్సిటీలో పని చేస్తున్నారు. ఆయన ఇసుకతో చిత్రపటాలు తయారు చేశారు. పాండిచ్చేరికి చెందిన నూర్జహాన్ టైలరింగ్ షాపులు, వస్త్ర తయారీ మిల్లుల్లో వచ్చిన రద్దుతో చేతి సంచులు, మహిళలకు హ్యాండ్ బ్యాగ్స్ రూపొందించారు. తిరుపతికి చెందిన బి.అర్చన నిర్మల్ పెయింటింగ్‌తో ఆకట్టుకున్నారు. లైవ్ ఆర్ట్‌లో కళాకారులు అక్కడికక్కడే పెన్, పెన్సిల్‌తో చిత్రాలు వేసి ఇస్తుండడం చాలా మందిని ఆకర్షించింది. వారివారి చిత్రాలను వేయించుకుని మురిసిపోయారు. కొత్తపేటకు చెందిన రాజ్‌కుమార్ వడయార్ ఫ్యాబ్రిక్, సిలికాన్ మెటీరియల్‌తో చేసిన ప్రముఖుల విగ్రహాల వద్ద సెల్ఫీల హడావుడి కనిపించింది. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న అంబేడ్కర్, రాజా రవి వర్మ, దామెర్ల రామారావు, ఆదికవి నన్నయ తదితర విగ్రహాలను జనం ఆశ్చర్యంగా తిలకించారు. పెయింటింగ్స్ ఆకృతుల ఖరీదు బాగా ఎక్కువగా ఉండడంతో చాలా మంది బేరమాడి వెనక్కు తగ్గారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కళాకారులను సత్కరించి... ఈ ప్రభుత్వం కళాకారులకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సుప్రసన్నశ్రీ చిత్రకళా ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్పీ నరసింహకిషోర్ బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 250 మంది సిబ్బంది, 6 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లను భద్రతా ఏర్పాట్లకు వినియోగించారు.



కళలకు పునరుజ్జీవం: శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు



రాజమహేంద్రవరం/సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలకు పునరుజ్జీవం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన 'అమరావతి చిత్రకళా వీధి' ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'చలనచిత్ర కళాకారులు కావచ్చు, నాటకరంగ కళాకారులు కావచ్చు.. కళాకారులంటే నాకు చాలా గౌరవం. అలాంటి ఈ శాఖకు దుర్గేశ్, తేజస్విలను ఎంపిక చేసిన రోజు కళలకు మంచి రోజులు వచ్చాయనే నమ్మకం కలిగింది. అది ఈ రోజు నిజమైంది. రానున్న రోజుల్లో వీరిద్దరి నాయకత్వంలో మరిన్ని గొప్ప గొప్ప కార్యక్రమాలు రాష్ట్రమంతా జరగాలి. కళాకారుల పట్ల ప్రజలకు ఉన్న అభిమానానికి ఇది మచ్చుతునకగా మిగిలింది. కళలను గౌరవించినచోట చక్కని వాతావరణం ఉంటుంది' అన్నారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ... 'ఇవాళ చిత్రకళా వీధి అనే పేరుతో చైరపర్సన్ తేజస్విని, మేము ఒక ఆలోచన చేశాం. ఇక్కడ లబ్ధ ప్రతిష్ఠులైన అనేక మంది కళాకారులు ఉన్నారు. కేవలం చిత్రలేఖనమే కాకుండా శిల్పాలు తయారు చేసే కళాకారులూ ఉన్నారు. వీటిని ప్రజలకు తెలియజేయడం ద్వారా ప్రజల్లో కళల పట్ల ప్రత్యేకమైన ఆసక్తి కల్పించాలని భావించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డి.మల్లికార్జునరావు కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాగా నిర్వాహకులను, అధికారులను, వలంటీర్లను మంత్రి దుర్గేశ్ ప్రత్యేకంగా అభినందించారు. కళాకారుల వద్దకు వెళ్లి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.




మినియేచర్ ఆర్ట్‌ని భూతద్దంలో తిలకిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



చిత్రకళా వీధిలో ప్రదర్శనలను తిలకిస్తున్న జనం



తాను వేసిన చిత్రం గురించి చెప్తున్న కళాకారిణి



రాజాధిరాజ, రాజమార్తాండ.... ఆకట్టుకున్న చిత్రం



చిరుధాన్యాలతో ప్రధాని మోదీ చిత్రపటం



సొగసుచూడతరమా...



తమ ప్రాజెక్టులతో ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులు





అచ్చుగుద్దినట్టు... పెన్సిల్ ఆర్ట్ కళాకారుల సందడి

జై జవాన్... జై కిసాన్ నినాదంతో చిత్రాలు

పి.రామారావు, బీఎస్ఎఫ్ జవాన్, ఛత్తీస్‌గఢ్ (స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పలాస)



దేశాన్ని ముందుకు నడిపించడంలో అత్యంత కీలకమైన రంగాలు వ్యవసాయం, రక్షణ. అందుకే రైతులు, జవాన్లతో చాలా సంవత్సరాలుగా పెయింటింగ్‌లు వేస్తున్నాను.

చెక్కతో అనేక రకాల వస్తువులు

మంజునాథ్, ఉడ్ కళాకారుడు, రామ్‌నగర్ జిల్లా, కర్ణాటక



చెక్కతో అన్ని రకాల వస్తువులను తయారు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా జరిగే ఎక్స్‌పోలలో ప్రదర్శనలకు పెడుతున్నాం. కర్ణాటకు నుంచి ఆహ్వానించడం ఆనందంగా ఉంది.

మేకతోలుతో కళాఖండాలు

మురళి, కళాకారుడు, నిమ్మలకుంట, ధర్మవరం మండలం, శ్రీసత్యసాయి జిల్లా



మేకతోలును ఇరవై రోజులు ప్రోసెస్ చేస్తే రూపం మారుతుంది. అప్పుడు తోలుబొమ్మ కళాఖండాలు తయారు చేస్తాను. టేబుల్ ల్యాంప్‌లు, వివిధ రకాల చిత్రాలు, తోరణాలు... ఇలా అనేక రకాల ఆకృతుల్లో పెయింటింగ్‌లు తయారు చేస్తున్నాం. మార్కెట్లో వీటికి డిమాండ్ అధికంగానే ఉంది.

ప్రధాని మోదీ పిలుపుతో మిల్లెట్ చిత్రాలు

మోకా విజయ్‌కుమార్, విశాఖపట్నం



ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని పెంచుతూ పెయింటింగ్‌లు వేయడం మొదలుపెట్టాను. ఇప్పటికి ఆరు అరుదైన రికార్డులను కైవసం చేసుకున్నాను. న్యూఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం -జీ20లో ప్రదర్శనలు ఇచ్చాను.

ఆదరణ బాగుంది

బత్తుల అర్చన, చిత్రకారిణి, తిరుపతి



ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్‌లో ఈ పెయింటింగ్ వేయడం మొదలు పెట్టాను. ఒక్కటి వేయడానికి రెండు రోజులు పడుతుంది. నా భర్త సహకారంతో 15 ఏళ్లుగా పెయింటింగ్‌లు వేస్తున్నాను. ప్రజాదరణ బాగుంది.

నిండు గర్భిణి... అయినా అంతా తానై!

రాష్ట్ర సృతజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్. తేజస్విపై ప్రశంసల జల్లు

రాజమహేంద్రవరంలో తొలిసారిగా ఏర్పాటుచేసిన అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ప్రశంసలు అందుకొంది. సుమారు 500 మంది కళాకారులు తమ పెయింటింగ్స్, ఆకృతులను ప్రదర్శించారు. ఈ నిర్వహణ ఒక్క రోజులో జరిగింది కాదు. ఎంతో కసరత్తు చేయడం వల్లే విజయవంతమైంది. దీని వెనుక ఒక మహిళ కృషిని అందరూ ప్రశంసిస్తున్నారు. ఆమే తేజస్వి పొడపాటి. రాష్ట్ర సృతజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్. ప్రస్తుతం ఏడో నెల గర్భవతి. సాధారణంగా విశ్రాంతి తీసుకునే సమయం. కానీ బాధ్యతలను విస్మరించలేదు. మండు టెండను సైతం లెక్కచేయకుండా కార్యక్రమ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. చాలా రోజులుగా అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడు తూ సమన్వయం చేశారు. స్టాల్స్ ఏర్పాటు నుంచి వీఐపీల రాక వరకు అంతా తానై నడిపించారు. ఉదరంపై చేయి వేసుకుంటూ నెమ్మదిగా నడుస్తూనే అంతా చక్కబెట్టారు.



ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు విగ్రహం వద్ద తేజస్వి





వేస్ట్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహం

రెండు తరాలుగా వేస్ట్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో....

కాటూరి వెంకటేశ్వరరావు, శిల్ప కళాకారుడు, తెనాలి



ఏడు తరాలుగా వంశపారంపర్యంగా విగ్రహాలు చేస్తున్నాము. గత రెండు తరాలుగా స్టెయిన్‌లెస్ స్టీల్ విగ్రహాలను తయారు చేస్తున్నాం. ఒక్కో విగ్రహం తయారీకి 45రోజులు నుంచి రెండు నెలలు పడుతుంది. కర్ణాటకలో పునీత్‌రాజ్‌కుమార్ విగ్రహాలు మేమే తయారు చేశాము.

విగ్రహాలకు ప్రాధాన్యత పెరుగుతోంది

రాజ్‌కుమార్ వడయార్, ప్రముఖ శిల్ప కళాకారుడు

విగ్రహాలకు గతంలో కంటే ప్రాధాన్యత ఎక్కువైంది. మా పూర్వీకుల నుంచి నాకు ఈ కళ వారసత్వంగా వచ్చింది. ఇప్పటివరకు కొన్ని వేల విగ్రహాలను తయారు చేశాను.

కనీసం మూడు రోజులు నిర్వహించాలి

ఎ.శ్రీనివాస్, రాజమహేంద్రవరం



ఈ ప్రదర్శన చాలా బాగుంది. పెయింటింగ్స్ అద్భుతంగా వున్నాయి. కనీసం మూడు రోజులైనా ఉంటే ఎక్కువ మంది చూసే అవకాశం ఉంటుంది.

తెలియని వాటిని తెలుసుకున్నాం

కృష్ణగౌతమ్, ఇంటర్ విద్యార్థి, రాజమహేంద్రవరం



చాలా పెయింటింగ్స్ ఎలా వేస్తారో తెలియదు. అటువంటి వాటిని తెలుసుకున్నాను. వీటితో కూడా కళాఖండాలు తయారు చేయవచ్చా అనిపించింది.

ఇటువంటి అద్భుత కళాఖండాలు చూడలేదు

హర్షిణి, రాజమహేంద్రవరం



ఈ ప్రదర్శనలో అద్భుతమైన కళాఖండాలు ఉన్నాయి. చిత్రకారులు గొప్పతనం వాటి తయారీ వెనుక కనిపిస్తోంది. వినియోగించి పడేసే సీసాలతో అద్భుత అవిష్కరణలు చేశారు. రావి ఆకుపై పెయింటింగ్స్ సూపర్.

వేసవి సెలవుల్లో పెడితే బాగుండేది

కె.భవాని, లాలాచెరువు



ఇక్కడి చిత్రాలు చూడ్డానికే కాదు విజ్ఞానానికి కూడా దోహదపడతాయి. వేసవి సెలవుల్లో పెడితే పిల్లలందరూ చూసే అవకాశం ఉండేది.

రాములోరి కల్యాణానికి కంత సారె



పాలకోవాతో తయారు చేసిన కంత సారె

పి.గన్నవరంలో 16 ఏళ్లుగా శ్రీరామనవమికి తయారీ

పట్టాభిరామస్వామి ఆలయంలో సీతమ్మవారికి

సమర్పించనున్న భీమరాజు-సత్యవాణి దంపతులు

పి.గన్నవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి క్షత్రియ వివాహ సంప్రదాయాన్ని అనుసరించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం గ్రామానికి చెందిన పేరిచర్ల భీమరాజు-సత్యవాణి దంపతులు కంత సారె సమర్పిస్తున్నారు. వైనతేయ గోదావరి నదీ తీరాన వేంచేసియున్న పట్టాభిరామస్వామి ఆలయంలో ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా స్వామి, అమ్మవార్ల కల్యాణానికి కంత సారె సిద్ధం చేశారు. వరుడు (రాముడు) తరఫున వధువు (సీతమ్మతల్లి)కి పాలకోవతో తయారు చేసిన సుమారు 108 రకాల స్వీట్లు, పిండి వంటలు సమర్పించనున్నారు. నవమికి 15 రోజులు ముందు నుంచీ సుమారు 200 లీటర్ల పాలతో తయారు చేసిన కోవాను ఉపయోగించి పంచె, చీర, పర్ణశాల, వివిధ రకాల పండ్లు, కాయలు, వస్తువుల ఆకారాలు, గోవిందనామం, పల్లకి, శంఖు, చక్రాలను అందంగా తీర్చిదిద్దారు. ఇవే కాకుండా వివిధ రకాల పిండి వంటలను కూడా అధిక మొత్తంలో సిద్ధం చేశారు.

పట్టాభిరామస్వామి ఆలయానికి 70 ఏళ్ల చరిత్ర ఉంది. 16 ఏళ్లుగా మా కాలనీలోని మహిళల సహకారంతో స్వామివారి తరఫున అమ్మవారికి కంతసారె అందిస్తున్నాము. మొదట చిన్నగా ప్రారంభించి ప్రస్తుతం భారీ స్థాయిలో తయారు చేస్తున్నాం. కల్యాణం అనంతరం ఆలయానికి వచ్చే భక్తులకు సారెను పంచుతాం. - **సత్యవాణి**



భద్రాద్రి రాములోరి కల్యాణానికి మండపేట బొండాలు

25ఏళ్లుగా అందజేస్తున్న రామారెడ్డి దంపతులు

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో జరిగే సీతారామచంద్రుల కల్యాణానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కేవీ రామారెడ్డి దంపతులు కొబ్బరి బొండాలు తయారు చేశారు. వీటితో పాటు కర్పూర దండలు, తలంబ్రాలు పోసుకునే కొబ్బరి కురిడీలను కూడా అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఒంటిమిట్టలో ఈ నెల 11న జరిగే సీతారాము కల్యాణానికి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గొల్లల మామిడాడ రామాలయం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణం, రామతీర్థంతో పాటు పలు రామాలయాల్లో జరిగే కల్యాణోత్సవాలకు కొబ్బరిబొండాలను తయారు చేసి పంపిస్తున్నామని రామారెడ్డి చెప్పారు. బొండాలను శుక్రవారం ఆయన ఇంటిలోని సీతారాముల విగ్రహాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. వీటిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చూసి రామారెడ్డి దంపతులను అభినందించారు.



కొబ్బరి బొండాలు తయారు చేసిన రామారెడ్డి దంపతులు



మృత్యువుతో పోరాడి.. ఓడి..

ఫార్మాసిస్ట్ నాగాంజలి మృతి

- కిమ్స్ బొల్లినేని ఉద్యోగి లైంగిక వేధింపులతో ఆత్మహత్యాయత్నం
- 13 రోజులు వైద్య చికిత్స
- రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పోస్టుమార్టం, కుటుంబీకులకు అప్పగింత
- నాగాంజలి తండ్రికి వివిధ రాజకీయ పార్టీల నాయకుల పరామర్శ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కూతురు ... 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పుట్టిన బిడ్డ. పేద కుటుంబమైనా ఎంతో అపురూపంగా చూసుకుని ఉన్నత చదువుల కోసం తపన పడి పట్టణం పంపిన ఆ తండ్రికి కుమార్తె మృతి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఉద్యోగి లైంగిక వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఫార్మాసిస్ట్ నల్లపు నాగాంజలి శుక్రవారం మృతిచెందింది. 13 రోజుల సుదీర్ఘ వైద్యచికిత్స అనంతరం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచింది. ఈ మేరకు నాగాంజలి మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో ప్రైవేట్ అంబులెన్సులో స్వగ్రామమైన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి తరలించారు. నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం, చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన అత్యంత సున్నితం కావడంతో ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చారు. నాగాంజలి తండ్రి దుర్గారావును పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా, మహిళా సంఘం నాయకులు తులసి, లావణ్య, ఇతర విద్యా, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకున్నారు. నాగాంజలి మృతదేహాన్ని అంబులెన్సులో తరలించే సమయంలో వామపక్షపార్టీల నాయకులు అరుణ్, మధు తదితరులు తీవ్ర నిరసన తెలిపారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


నాగాంజలి మృతదేహాన్ని అంబులెన్సులోకి ఎక్కిస్తున్న దృశ్యం

పుట్టెడు దుఃఖంలో తండ్రి దుర్గారావు


చెట్టుకింద దిగాలుగా కూర్చున్న దుర్గారావు

ఆసుపత్రి వద్ద నాగాంజలి తండ్రి దుర్గారావు పరిస్థితి చూస్తే ఎవరికైనా కన్నీళ్లు పెట్టించకమానవు. నోటమాట రాని పరిస్థితుల్లో దిగాలుగా, దైన్యంగా ఎవరికీ చెప్పుకోలేక, బాధ ఆవేదనలను తనలోనే దిగమింగుకోలేని నిస్సహాయపరిస్థితుల్లో ఆసుపత్రి పోలీస్ అవుట్‌పోస్టు వద్ద ఉన్న చెట్టు కింద వేదనతో కూర్చోవడం అందరినీ కలచివేసింది. కూతురి మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతుంటే తనవారెవరూ తోడు లేని పరిస్థితుల్లో దుర్గారావు తానొక్కడే మౌనంగా రోదిస్తూన్న స్థితి అత్యంత దయనీయంగా కనిపించింది. ఎవరెవరో నాయకులు రావడం, పరామర్శించడం, సంఘ పెద్దలు తోడుగా నిలవడం ... అవన్నీ దుర్గారావుకు కలగానే మిగులుతాయా అన్నట్టుగా అక్కడి పరిస్థితులు మారాయి.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మా పాపకు జరిగిన అన్యాయం ఏ పాపకూ జరగకూడదు. వాడిని కఠినంగా శిక్షించాలి, ఏమైనా సరే నిందితుడిని కఠినంగా శిక్షించాల్సిందే. ఇది మా కోరిక. ప్రభుత్వం తరఫున మాకు అన్ని సహకారాలు అందుతున్నాయి. మా సంఘం తరఫున కూడా మంచిగానే చూస్తున్నారు అని నాగాంజలి తండ్రి దుర్గారావు తెలిపారు.

డిప్యూటీ సీఎం ఆదేశాలతో...

నాలుగు దశాబ్దాల సమస్యకు పరిష్కారం


పిఠాపురంలో ఎల్‌పీసీలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా పిఠాపురంలోని రథాలపేటలో ఉంటున్న తమకు ఇళ్ల పట్టాలులేవని అక్కడ ప్రజలు ఆ ప్రాంతంలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకురావడంతో సమస్యకు పరిష్కారం లభించింది. పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న 15మందిని గుర్తించి వారికి రెవెన్యూ అధికారులు ఎల్‌పీసీలు జారీ చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లా పిఠాపురంలో లబ్ధిదారులకు ఎమ్మెల్సీ నాగబాబు ఎల్‌పీసీలు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ పవన్ రథాలపేటలో పర్యటించినప్పుడు సమస్యలు తెలియజేయగానే కుళాయి వేయించి తాగునీటి సమస్య పరిష్కరించారని, ఇప్పుడు పట్టాలు అందజేశారని తెలిపారు. అంతకుముందుకు సాంఘిక సంక్షేమశాఖ బాలికల సమీకృత వసతి గృహంలో రూ.36.5లక్షలతో నిర్మించిన ఆధునీకరణ పనులను, పాదగయ ఎదురుగా జేజీఆర్ గ్రూపు నిర్మించిన బస్‌షెల్టర్‌ను నాగబాబు ప్రారంభించారు. వసతిగృహంలో బాలికలతో ముచ్చటించారు. వసతులు, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, భీమిలి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ ఉన్నారు.

సోదరుడి పిండ ప్రదానానికి పయనమై

ప్రాణాలు విడిచిన సోదరులు

- లారీ ఢీకొని అన్నదమ్ముల మృతి
- గంగలకుర్రులో విషాదంలో మరో విషాదం


ఘటనా స్థలం వద్ద సోదరులను ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

అంబాజీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సోదరుడు మృతితో ఆ ఇంట్లో విషాదం నెలకొన్న పది రోజులకే మరో విషాదకరమైన ఘటన జరిగింది. సోదరుడు దశదిన కర్మ కార్యక్రమాలు నిర్వహించి పిండ ప్రదానానికి మోటార్‌సైకిల్ పై వెళ్తున్న అన్నదమ్ములను లారీ మృత్యురూపంలో కబళించింది. ఒకరు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా మరొకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన మంగిపూడి సూర్యనారాయణ గత నెల 24న మృతిచెందాడు. అతడి దిన కార్యక్రమాన్ని సోదరులు మంగిపూడి రామచంద్రరావు(67) మంగిపూడి నాగరాజు(64)లు శుక్రవారం ఇంటి వద్ద నిర్వహించారు. అనంతరం కర్మ కార్యక్రమాలు నిర్వహించి వాటిని కౌశికలో (గ్రామ శివారున ఓ కాలువ) కలిపేందుకు మోటార్‌సైకిల్‌పై అన్నదమ్ములు బయలుదేరివెళ్లారు. ఆ ఇంటికి సమీపంలోని గంగలకుర్రు ప్రాథమిక పాఠశాల నాలుగురోడ్ల జంక్షన్‌లోకి వచ్చే సరికి ముక్కామల నుంచి అంబాజీపేట వైపు అతివేగం, నిర్లక్ష్యంతో వెళ్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొంది. దీంతో నాగరాజు తలకు తీవ్రగాయాలు, రామచంద్రమరావుకు బలమైన గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్ ద్వారా అమలాపురం ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో నాగరాజు మృతిచెందగా రామచంద్రరావు చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగరాజుకు భార్య, కుమారుడు ఉన్నారు. నాగరాజు విజయవాడలో చార్టర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఇన్‌కంట్యాక్స్ కార్యాలయంలో అధికారిగా పనిచేస్తున్నారు. కాగా రామచంద్రరావుకు వివాహం కాలేదు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించారు. దిన కార్యక్రమం జరిగిన రోజే మరో విషాదం జరగడంతో గంగలకుర్రులో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి పేర్కొన్నారు.

సెంట్రల్ జైలులో పరిచయం..
ఇంటి తాళాలు బద్దలు కొట్టి దొంగతనం

ఒకరి అరెస్టు.. మరొకరి కోసం గాలింపు
రూ.15.48 లక్షల విలువైన 19 రకాల బంగారు ఆభరణాలు స్వాధీనం


సమావేశంలో మాట్లాడుతున్న కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, పోలీసు అధికారులు

అమలాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జైలులో ఉన్న సమయంలో ఏర్పడ్డ పరిచయంతో తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలోని ఓ దొంగను పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి రూ.15.48 లక్షల విలువైన 19 రకాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్‌లు మాట్లాడారు. ఈ వివరాలను ఎస్పీ వెల్లడించారు. రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామంలో ఫిబ్రవరి 22వ తేదీన రాత్రి సమయంలో దొంగలు ఓ ఇంటి తాళాలు బద్దల కొట్టి బంగారు వస్తువులను భారీగా చోరీ చేశారు. వాటిని అమ్మే క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన ఉండి శివసుబ్రహ్మణ్యంతో పాటు సెంట్రల్ జైలులో పరిచమైన పందిరి వెంకటనారాయణ ఇద్దరూ కలిసి లక్ష్మీపోలవరంలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. అయితే వాటిలో కొన్ని వస్తువులను అమ్మేందుకు ప్రయత్నిస్తున్న ఉండి శివసుబ్రహ్మణ్యంను రావులపాలెం జూనియర్ కళాశాల సమీపంలో గల సర్వీసు రోడ్డులోని ఖాళీ స్థలంలో ఉండగా పాత నేరస్తుడైన సుబ్రహ్మణ్యాన్ని అదుపులోకి తీసుకుని అరెస్టుచేశారు. అతడి నుంచి రూ.15.48లక్షలు విలువైన 172.661 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడైన పందిరి వెంకటనారాయణ కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ కేసును చేధించడంలో కీలకంగా పనిచేసిన రావులపాలెం సీఐ ఎం.శేఖర్‌బాబు ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బందికి రివార్డులు అందించారు. దర్యాప్తులో సహకరించిన హెచ్‌సీ ఎస్.సత్యనారాయణ, కానిస్టేబుల్ పి.త్రిమూర్తులు, సీహెచ్ శ్రీనుబాబు, జి.కృష్ణసాయి, సుంకర బైసన్‌జీవన్‌కు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. రికవరీ చేసిన వస్తువులను డీఎస్పీ మురళీమోహన్ ప్రదర్శించారు.

చీటీల సొమ్ముతో ఉడాయించిన మహిళ

రూ.1.40కోట్లు మేర మోసం
పిఠాపురం పోలీసులను ఆశ్రయించిన బాధితులు


పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళలు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చీటీల సొమ్ముతో ఒక మహిళ ఉడాయించింది. మోసపోయిన బాధితులు శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి న్యాయం చేయాలని కోరారు. పిఠాపురంలోని కత్తులగూడెంకు చెందిన ఎం.కుమారి కొంతకాలంగా ప్రవేటుగా ఇంటి వద్ద చిట్‌ఫండ్ నిర్వహిస్తోంది. సుమారు 130 మంది వద్ద రూ.1.5లక్షల వంతున చీటీలు కట్టించుకుంది. అయితే కొంతకాలంగా చీటీల సొమ్ము సక్రమంగా చెల్లించకపోవడంతో మహిళలు ప్రశ్నించగా త్వరలోనే అందరికి సొమ్ములు చెల్లిస్తానని హామీ ఇచ్చింది. కొద్ది రోజులుగా ఆమె ఇంటి వద్ద కనబడకపోవడంతో మోసపోయామని గుర్తించిన మహిళలు శుక్రవారం రాత్రి పిఠాపురం పోలీసుస్టేషన్‌కు తరలివచ్చారు. సుమారు రూ.1.40 కోట్లు మేర చీటీల సొమ్ముతో కుమారి పరారయిందని మహిళలు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

కొనసాగిన నాటికల పోటీలు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలో శ్రీరామచంద్ర నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదోవ జాతీయస్థాయి నాటికల పోటీలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం విశాఖపట్టణం తెలుగు కళాసమితి కళాకారులు ప్రదర్శించిన నీ ఖరీదెంత నాటిక, కొండెవరం మణికంఠ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన కొత్త తరం కొడుకుల నాటిక ఆకట్టుకున్నాయి.

పెళ్లింట తీవ్ర విషాదం

పెళ్లి షాపింగ్‌కి వెళ్లి వస్తుండగా యువకుడి మృతి
లారీ ఢీకొనడంతో ప్రమాదం


చిక్కాల శ్రీను (ఫైల్)


మృతదేహం

జగ్గంపేట రూరల్/ గండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. మరో 15 రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. పెళ్లి షాపింగ్ నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా మృత్యువు కాటేసింది. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన చిక్కాల శ్రీను (28)కు గోకవరం మండలం మల్లవరానికి చెందిన అమ్మాయితో పెళ్లి నిశ్చయమైనట్టు తెలిసింది. పెళ్లి షాపింగ్ నిమిత్తం శుక్రవార పెద్దాపురం వెళ్లి తిరిగి వస్తుండగా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి భారత్ పెట్రోల్‌బంక్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న శ్రీను కిందపడగా తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పెళ్లి పనుల్లో కుటుంబంతా సంతోషంగా ఉన్న సమయంలో ఈ విషయం తెలియగానే ఒక్కసారిగా కుప్పకూలారు. అప్పటివరకు బంధుమిత్రులతో సంతోషంగా ఉన్న కుటుంబీకులు, ఇరుగుపొరుగు వారు కన్నీరుమున్నీరయ్యారు. 4రోజుల కిందటే పసుపు కొట్టడం జరిగిందని, ఇంతలోనే మృత్యు ఒడిలోకి శ్రీను చేరడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. శనివారం పుట్టిన రోజు జరుపుకోవాల్సిన శివ అకస్మాత్తుగా కన్ను మూయడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. శ్రీనుకు తండ్రి కాట మస్వామి, తల్లి సావిత్రి, సోదరి ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కూతురిపై అత్యాచారయత్నం

భార్య ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు

కరప, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కూతురు వరసైన యువతిపై అత్యాచారయత్నానికి ఒడిగట్టిన ఉదంతం కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామంలో జరిగింది. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేళంగి గ్రామానికి చెందిన మండాది అమ్మాజీకి ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. అమ్మాజీ సోదరి చనిపోవడంతో 27ఏళ్ల ఆమె కూతురిని చేరదీసి తన ఇంట్లో ఉంచుకుంది. కాగా ఈనెల 3వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయం చూసి అ మ్మాజీ భర్త శ్రీనివాసు కూతురు వరస అయిన ఆ యువతిని బలత్కరించబోయాడు. దీంతో బెదిరిపోయిన ఆ యువతి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడకు చేరుకుని తలుపులు కొట్టారు. విషయం బయటకు చెప్తే చంపేస్తానని సదరు యువతిని బెదిరించి అక్కడ నుంచి పారిపోయాడు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన అమ్మాజీకి స్థానికులు జరిగిన విషయం చెప్పడంతో శుక్రవారం ఆమె కరప పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిపై ఎస్ఐ తోట సునీత అత్యాచారయత్నం కింద కేసు నమోదు చేసి బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైసీపీ నుంచి సామర్లకోట చైర్‌పర్సన్ సస్పెండ్

సామర్లకోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణను వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసీపీ వ్యతిరేక కార్యకలాపాలకు చైర్‌పర్సన్ అరుణ పాల్పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. అలాగే సామర్లకోట మండలం జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృత భర్త ఎలిశెట్టి సూర్యనారాయణ మూర్తిని కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.

చమురు వినియోగంలో 3వ స్థానంలో భారత్

- ఆయిల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ సలోమ యాండో
- జేఎన్టీయూకేలో ఫిపి స్టూడెంట్ చాప్టర్ 13వ వార్షిక సమావేశం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాండో, వీసీ ప్రసాద్, అతిథులు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారతదేశం చమురు వినియోగంలో 3వ స్థానంలో ఉందని, ప్రపంచవ్యాప్తంగా 13.2 బీవోఈ (బ్యారెల్ ఆఫ్ ఈక్వివాలెంట్) వినియోగిస్తుండగా భారత్‌లో 4.7 బీవోఈ వినియోగిస్తున్నారని ఆయిల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ సలోమ యాండో అన్నారు. జేఎన్టీయూ వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాలలోని జేఎన్టీయూకే ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పెట్రోలియం ఇండస్ట్రీ (ఫిపి) స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో 13వ వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సలోమ యాండో, గౌరవ అతిథిగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, అతిథిగా ఫిపి డైరెక్టర్ దేబ్ అధికారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా జేఎన్టీయూకే ఫిపి స్టూడెంట్ చాప్టర్ అధ్యాపక సలహాదారుడు ప్రొఫెసర్ కేవీ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సలోమ యాండో మాట్లాడుతూ భారతదేశంలో 26 అవక్షేపణా బేసిన్లు ఉండగా మొత్తం 3.36 మిలియన్ల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో వ్యాపించి ఉన్నాయని తెలిపారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విద్యార్థులు రాష్ట్ర, దేశ అవసరాల మేరకు ఇంధన వనరులను ఉత్పత్తి చేసేలా నూతన ఆవిష్కరణలను చేపట్టాలని సూచించారు. కార్లు, ద్విచక్ర వాహనాల ఉత్పత్తిలో భారతదేశం ఎంతో ముందుందన్నారు. దేశంలోని 11 విద్యాసంస్థల నుంచి వచ్చిన ఫిపి స్టూడెంట్ చాప్టర్ ప్రతినిధులకు అతిథులు ఫ్లాగ్, బ్యాడ్జ్‌ను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.బాలకృష్ణ, స్వర్ణకుమారి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, మాజీ వీసీ పద్మరాజు, ఫిపి స్టూడెంట్ చాప్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టిడ్కో అపార్ట్‌మెంట్ల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): టిడ్కో అపార్ట్‌మెంట్ల సముదాయాల వద్ద ఉన్న సమస్యలన్నింటి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్ తెలిపారు. కాకినాడ పిఠాపురం గోర్స రోడ్డులో ఉన్న టిడ్కో అపార్ట్‌మెంట్లలో ఉన్న సమస్యలతో అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అజయకుమార్ శుక్రవారం సాయంత్రం అక్కడ పర్యటించారు. అపార్ట్‌మెంట్లవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిలిచిపోయిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. డ్రైన్ సమస్యలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనరు కనకారావుకు సూచించారు. పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు నిర్వహిస్తామని చెప్పారు. తక్షణం జంగిల్ క్లియరెన్స్ చేయిస్తామని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద పిఠాపురంలోనే అధిక అక్యుపెన్సీ ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మున్సిపల్ మంత్రి నారాయణ సూచనలకనుగుణంగా జూన్ నాటికి 80వేల టిడ్కో గృహాలను లబ్ధిదారులకు నూరుశాతం అప్పగిస్తామని తెలిపారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన 10వేల అపార్ట్‌మెంట్లును కేటాయించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఆయన వెంట పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి, మున్సిపల్ కమిషనరు కనకారావు, జనసేన నాయకుడు పిల్లా శివశంకర్ ఉన్నారు.


పిఠాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్

బిర్యానీ కోసం వెళ్లి...

బైక్ ఢీకొని యువకుడి మృతి
మరొకరికి తీవ్రగాయాలు

గండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ తినేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. గండేపల్లి ఎస్ఐ శివనాగ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన బాడవుల కేదార్ మణికంఠ(21) రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం రాత్రి తన స్నేహితులతో కలిసి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం బిర్యానీ తినేందుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా గండేపల్లి వచ్చేసరికి రాత్రి 9 గంటల సమయంలో ఎన్టీరాజాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై స్పీడ్‌గా రాంగ్ రూట్‌లో వచ్చి మణికంఠ బైక్‌ను ఢీకొన్నాడు. మణికంఠను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మరో యువకుడు విష్ణువర్ధన్‌కు గాయాలయ్యాయి. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకున్న యువకుడు


కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఉరేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామానికి చెందిన మట్టా చంద్రరావు, భార్య కళావతికి కుమార్తె, కుమారుడు మట్టా చంద్రశేఖర్(23) ఉన్నారు. కుమార్తెకు వివాహం అయ్యింది. కళావతి హైదరాబాద్‌లో ఇంటిపని చేస్తుంది. చంద్రశేఖర్ ఏపీ ఫైబర్‌నెట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం చంద్రరావు పొలం వెళ్లి సాయంత్రం 6 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి లోపలికి వెళ్ళి చూసేసరికి కుమారుడు చంద్రశేఖర్ ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వేగులయ్య కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. అసరాగా ఉంటాడనుకున్న కొడుకు ఉరేసుకుని మృతిచెందడంపై తండ్రి బోరున విలపించడం అందరిని కంటతడిపెట్టించింది.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

ఏలేశ్వరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని కంబాలపాలెనికి చెందిన సిరిబోతుల లక్ష్మీ పార్వతి తర భర్త రామకృష్ణ కనిపించడం లేదని శుక్రవారం ఏలేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్తను ఫారెస్టు అధికారులు చెట్లు కేసు విషయంపై రాజవొమ్మంగి అటవీ శాఖ కార్యాలయానికి పిలిపించారని అప్పటి నుంచి కనిపించడం లేదని తెలిపింది. భర్త ఆచూకీ కోసం న్యాయస్థానంలో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసినట్టు చెప్పింది.

వైసీపీ భూముల రీసర్వేకు మహిళ బలి

తనకున్న భూమి ఆన్‌లైన్‌లో మరొకరి పేరు ఉండడంతో మనస్తాపం
గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి


మరణించిన సురేఖ

అనపర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గత పాలనలో వైసీపీ చేపట్టిన భూముల రీసర్వేలో జరిగిన అవకతవకలకు తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన మహిళ బలైపోయింది. అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన నల్లమిల్లి సురేఖ తండ్రి సబ్బెళ్ళ సుబ్బారెడ్డి తనకున్న రెండెకరాల పొలాన్ని కుమార్తె సురేఖ సహా నలుగురికి సమానంగా రాసి 2021లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఇటీవల సుబ్బారెడ్డి పన్నులు చెల్లించేందుకు వెళ్లగా ప్రభుత్వ రికార్డులలో సురేఖ పేరున ఉండాల్సిన భూమి మరొకరి పేరుతో ఉండడంతో ఆమె మనస్తాపానికి గురైంది. దీంతో ఆమె గురువారం సాయంత్రం ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో బంధువులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. సురేఖ భర్త భక్తుడు రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

చిత్ర కళాప్రదర్శన అద్భుతం

నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



ప్రదర్శనను తిలకిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 4: అమరావతి చిత్రకళావీధి- ఆంధ్రస్ మోస్ట్ వైబ్రంట్ ఆర్ట్‌ఫెస్టివల్‌లో అద్భుత కళారూపాలు ప్రదర్శించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం నిర్వహించిన చిత్రకళావీధికి హాజరైన వీసీ చిత్రకళా ప్రదర్శనలను సందర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు నైపుణ్యంతో గీసిన చిత్రాలు ఎంతో బాగున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం కేంద్రకారాగారం ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. ఖైదీలు సైతం ఎంతో నైపుణ్యంతో చిత్రాలు వేయడం విశేషమన్నారు. ఈ సందర్భంగా వీసీకి ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, మంత్రి దుర్గేష్ జ్ఞాపికను అందజేశారు. అలాగే నన్నయ వర్శిటీ నుంచి సహకారం అందించిన 120 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వర్సిటీ నుంచి హాజరైన 57మంది కళాకారులను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త పి.ఆనంద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, పీవోలు ఎం.గోపాలకృష్ణ, ఎ.ఎం.శిరీషా, ఎల్.సుజాత, ఎస్.రాజ్యలక్ష్మి, ఎల్.ముత్యాలనాయుడు, కె.రాజరాజేశ్వరీదేవి పాల్గొన్నారు.

మైనింగ్ పరిశ్రమలకు, విద్యా సంస్థలకు ఎంఈఏఐ వారధి

విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ రావు

రాజానగరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మైనింగ్ పరిశ్రమలకు, విద్యాసంస్థలకు మధ్య ఎంఈఏఐ స్టూడెంట్ చాప్టర్ వారధిగా నిలుస్తుందని విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ రావు అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని మైనింగ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఏఐ)స్టూడెంట్ చాప్టర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌హేన్సింగ్ మైనింగ్ ఆపరేషన్స్ ది రోల్ ఆఫ్ ఏఐ అండ్ ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ అనే అంశంపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు రావు విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగవకాశాలను పెంచుకునే మార్గంలో అప్రెంటీస్‌షిప్ అవసరమన్నారు. మైనింగ్ ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఉపాధి కోసం ఎదురు చూడకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరికొందరికి ఉద్యోగవకాశాలు కల్పించాలన్నారు. ఎంఈఏఐ సంయుక్త కార్యదర్శి, కోశాధికారి బి.సాహూ మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత దేశం రెండో స్థానంలో ఉందన్నారు. జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ మైనింగ్ విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గైట్ ప్రిన్సిపాల్ టి.జయానందకు మార్, డీన్లు బి.ప్రభాకరరావు, ఆర్ఎస్‌రాజు, మైనింగ్ విభాగాధిపతి వై.వినోద్‌కుమార్, ఎంఈఏఐ హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలంటూ ఏఐకేఎంఎస్ ధర్నా

రాజానగరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) శుక్రవారం రాజానగరంలో ధర్నా చేపట్టారు. దీనిలో భాగంగా స్థానిక అన్నదాన సత్రం నుంచి ప్రదర్శన, ర్యాలీగా బయలుదేరి హామీలు అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

నంది అవార్డు ఉత్సవాల్లో ఆదిత్య విద్యార్థుల సేవలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్ రోడ్డులోని ఏకేసీ రోటరీ హాల్లో శుక్రవారం జరిగిన నంది అవార్డు ఉత్సవాల్లో స్థానిక ఆదిత్య డిగ్రీ మహిళా కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు 40 మంది సేవలందించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీవో జీవీఎస్ నాగేశ్వరరావును ఫిలాంత్రోఫిక్ సొసైటీ, పాన్ ఇండియా లిమిటెడ్ అధ్యక్షుడు అద్దంకి రాజా నిర్వహణలో మంత్రి కందుల దుర్గేష్ సత్కరించారు.

జీజీయూలో మధురం సినిమా బృందం సందడి



విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న హీరోయిన్ వైష్ణవి సింగ్

రాజానగరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మధురం (ఎ మెమొరబుల్ లవ్) సినిమా బృందం సందడి చేసింది. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా జీజీయూను సందర్శించారు. ఈ సందర్భంగా హీరో ఉదయ్‌రాజ్, హీరోయిన్ వైష్ణవిసింగ్ మాట్లాడుతూ ఈనెల 18న మధురం విడుదలవుతుందని అందరూ చూసి విజయవంతం చేయాలన్నారు. మధురం ఒక ప్రేమ కథా చిత్రంగా దర్శకుడు రాజేష్ చికిల్ తెరకెక్కించారన్నారు. హీరోహీరోయిన్లతో కలిసి విద్యార్థులు డాన్సు చేశారు. సెల్ఫీలు తీసుకున్నారు. కార్యక్రమంలో నిర్మాణ బంగార్రాజు పాల్గొన్నారు.

హరేరామ స్వామికి పంచామృతాభిషేకం

కోరుకొండ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కోరుకొండ హరేరామ సమాజంలో సీతారామచంద్రమూర్తికి లక్ష్మణస్వామి, ఆంజనేయ స్వామి పరివార సమేత శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఓం నమఃశివాయ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామి వారి పంచామృతాభిషేకం ఆలయార్చకులు మిరియాల రామచంద్రరావు, ఎంవీఎస్ త్రిమూర్తులు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి ఆలయంలో విష్ణు సహస్రనామం, లలిత సహస్రనామం, గోవిందనామం పారాయణ జరిగింది. శ్రీరామరక్ష స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో హరేరామ భజన భక్త సమాజం కమిటీ సభ్యులు, మహిళ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక బాధ్యత అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

కోరుకొండ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వ్యవసాయ విద్యతో పాటు సామాజిక బాధ్యత కూడా అవసరమని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పరిధిలోని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆర్ఏడబ్ల్యూఈపీ ప్రోగ్రాంలో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ప్రత్యేక కార్యక్రమం శ్రీరంగపట్నంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశ్యాన్ని విద్యార్థులతో పాటు గ్రామస్థులకు తెలిపారు. అలాగే వారం రోజుల పాటు గ్రామంలో నిర్వహించబోయే కార్యక్రమాలను గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దాల రమణ మాట్లాడుతూ ఈ వారం రోజుల పాటు గ్రామంలో విద్యార్థులకు ఎటువంటి వసతులు కావాలన్నా సమకూరుస్తామన్నారు. అనంతరం గ్రామంలో వన మహోత్సవం నిర్వహించారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ దక్షిణామూర్తి, పంచాయతీ కార్యదర్శి మతార్‌బీబీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌లో రమ్యసుధ ప్రతిభ

రంగంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్‌సీఈఆర్‌టీ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జాతీయస్థాయి సెమినార్‌లో 'జీరో హంగర్ విత్ మైటి మిల్లెట్స్' అనే అంశంపై రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ పరిశోధపత్రాన్ని సమర్పించారు. అలాగే ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ ఇన్ ఎడ్యుకేషన్ ఏజ్ కన్సర్న్ టూ ఎన్ఈపీ-2020 అనే ముఖ్య ఉద్దేశ్యంతో భారతీయ శిక్షా మండల్ మహారాష్ట్ర వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయ సెమినార్‌లో 'హీలింగ్ త్రూ హెరిటేజ్ ది సైన్స్ ఆఫ్ వేదిక్ ఫుడ్ హేబిట్స్' అనే అంశంపై అడాలెసెంట్ ఎడ్యుకేషన్ ఫర్ వికసిత్ భారత్ అనే ముఖ్య ఉద్దేశ్యంతో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. రమ్యసుధ సమర్పించిన రెండు పరిశోధన పత్రాలు జాతీయస్థాయిలో ఉత్తమమైనవిగా ఎంపికయ్యాయి. ఈ రెండు సెమినార్లలో దేశ వ్యాప్తంగా 400 మందికి పైగా పరిశోధన పత్రాలు సమర్పించగా వాటిలో 60 మాత్రమే ఉత్తమమైనవిగా గుర్తించబడి, జాతీయ స్థాయి జర్నల్స్‌లో ముద్రణకు ఎంపికయ్యాయి. వాటిలో తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని రమ్యసుధ పంపిన పరిశోధన పత్రాలు ఉండడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. ఆయన శుక్రవారం ఆన్‌లైన్‌లో వచ్చిన సర్టిఫికెట్స్‌ను ఆమెకు అందించారు. ఈ సందర్భంగా రమ్యసుధను ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, ఉపాధ్యాయులు, అభినందించారు.

నేడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

కొవ్వూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని బాబు జగ్జీవన్‌రామ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు అన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక హర్షిత లాడ్జి వద్ద బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
» బిక్కవోలులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



బిక్కవోలులో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని రంగాపురం, ఇళ్లపల్లి, బిక్కవోలు, ఆర్ఎస్. పేట, ఊలపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ, పంచాయతీ సాధారణ నిధులు రూ.77.67 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభించి, రూ.1.11 కోట్లతో నిర్మించనున్న పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జోడునాదాల తూము వద్ద త్వరలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నామని, రంగాపురం, ఇళ్లపల్లి, తుమ్మలపల్లి, పాకలు ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే రంగాపురంలో ఏర్పాటు చేసిన 21 సీసీ కెమెరాలను, ఊలపల్లిలో కాకర్ల రామన్నచౌదరి సౌజన్యంతో రూ. 7లక్షలతో నిర్మించిన బస్‌స్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల బిక్కవోలు మండల పరిషత్‌లో ఎంపీటీసీలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరితే వారి ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని, అసలు తమ ఎంపీపీ ఎందుకు రాజీనామా చేశారో, మరలా ఎంపీటీసీ పదవికి కూడా ఎందుకు రాజీనామా చేశారో వివరించాలన్నారు. ఎంపీటీసీలను కించపరిచేలా మాట్లాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ తేతలి సుమ, కూటమి నాయకులు శివరామకృష్ణంరాజు, ఇందల వీరబాబు, పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, తనుకు శ్రీధర్, నడింపిల్లి చిరంజీవిరాజు, కానాటి అప్పలస్వామి, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, జేరా వేణమ్మ, సరెళ్ల సుమలత, ఎంపీడీవో శ్రీనివాస్, తహశీల్దార్ సత్యకృష్ణ, డీఈఈ అచ్యుతరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గత ఐదేళ్లూ తాత్కాలిక విరామం

అనపర్తి, ఏప్రియల్ 4(ఆంధ్రజ్యోతి): 1983లో మండలంలోని రామవరంలో స్థాపించిన నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ ఏటా నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని, ఐదేళ్లుగా అరాచక పాలన నేపథ్యంలో పరిషత్ నిర్వహణకు తాత్కాలిక విరామం ప్రకటించవలసి వచ్చిందని పరిషత్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 21 నుంచి 24వరకు నాటిక పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వైసీపీకి చెందిన శకుని మామ గతంలో పరిషత్ అకౌంట్లు కూడా అడిగారని, చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామని, తేదీ తెలియజేస్తే ఎక్కడికి రమ్మన్నా వచ్చి లెక్కలు చెబుతామని రామకృష్ణారెడ్డి అన్నారు.

నేడు భద్రాచలం వరకూ ఆర్టీసీ స్పెషల్ బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో 6న జరిగే వేడుకకు ముందస్తుగా ఈనెల 5వ తేదీ నుంచి ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి భద్రాచలం వరకూ నూతన స్పెషల్ బస్సులు నడుపుతున్నామని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బాం తెలిపారు. ఈ స్పెషల్ బస్సులు 5వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రారంభమవుతాయని, ప్రతి గంటకు ఒక స్పెషల్ బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ స్పెషల్ సర్వీసులకు భక్తుల సౌకర్యార్థం రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామని, టిక్కెట్లు కావాల్సిన వారు ఏపీఎస్ఆర్టీసీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. రాములవారి కల్యాణం అనంతరం కూడా భద్రాచలం నుంచి 6వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి తిరిగి రాజమహేంద్రవరానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని డీఎం పేర్కొన్నారు.

నర్సరీ రైతుకు నంది అవార్డు

కడియం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కడియపులంక సత్యదేవా నర్సరీ రైతు పుల్లా వీరవెంకట్రావుకు నంది అవార్డు దక్కింది. రాజమహేంద్రవరం ఆంధ్ర కేసరి కళాశాల ప్రాంగణంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును మంత్రి కందుల దుర్గేష్. వీరవెంకట్రావుకు అందజేశారు.

గద్దర్ జయంతి

కడియం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరి సెంటర్‌లో శుక్రవారం ఎన్టీఆర్, ఘంటసాల అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో శుక్రవారం గద్దర్ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బొర్రా సుబ్బారావు, సాయిరామ్ ఆటోయూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన విగ్రహాల అందజేత

గోకవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని ఎలుకల దిబ్బ కాలనీలో ఏర్పాటు చేసిన రామాలయానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు శుక్రవారం నూతన విగ్రహాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు విగ్రహాల ప్రతిష్ఠకు సహకరించాలని శ్రీనివాసరావును అభ్యర్థించగా స్పందించి సుమారు రూ.36,500 వెచ్చించి రాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలను తయారు చేయించి కమిటీ సభ్యులకు అందజేశారు.

నూకాలమ్మ జాతర

కోరుకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగపట్నంలో నూకాలమ్మ జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావును గ్రామస్థులు సత్కరించారు. ఆలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయల సొంత డబ్బు వెచ్చించడ అభినందనీయమన్నారు. తాను ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని కంబాల పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన వారికి కంబాల మెమొంటోలు అందజేశారు. సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగాంజలి మృతి బాధాకరం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



నాగాంజలి తండ్రి దుర్గారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థిని నల్లపు నాగాంజలి మృతి బాధాకరమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చిన ఆయన నాగాంజలి తండ్రి దుర్గారావును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగాంజలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, వ్యక్తిగతంగా తమ ట్రస్టు నుంచి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. నాగాంజలి సంఘటన తర్వాత తాను ఆసుపత్రికి వెళ్లి వైద్యులను ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నానని, ఆమె కోలుకోవాలని దేవుడిని ప్రార్థించేవాడినని అన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం వస్తుందని పేర్కొన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం బాలికలు, మహిళలకు భద్రత కల్పించాలని ఎస్ఎఫ్‌డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్‌డబ్ల్యుఓ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం నందం గనిరాజు సెంటర్లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మరణానికి కారకుడైన దీపక్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చింతలపూడి సునీల్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.త్రిమూర్తులు, కె.శ్రీనివాస్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష, ప్రజాసంఘాల నాయకుల నిరసన

ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం అంబులెన్సులో తరలించే సమయంలో సీపీఐ, సీపీఎం, ఐద్వా, మహిళ సంఘం తదితర వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు అడ్డుకుని నిరసన తెలిపారు. మృతదేహాన్ని కనీసం చూడనీయకుండా తరలించడం ఏమిటని ప్రశ్నిస్తూ అడ్డుకున్నారు. నాగాంజలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడైన కిమ్స్ ఉద్యోగి దీపక్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫార్మ డీ విద్యార్థిని నాగాంజలి మృతి ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు రాజేష్ అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ నాగాంజలి మృతి తమను తీవ్రంగా కలసి వేసిందని, కామాంధుడైన కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఉద్యోగి దీపక్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సినీఫక్కీలో 'కడుపు' నాటకం

» పిల్లల్లేక.. లేని గర్భం ఉన్నట్టు భర్తను నమ్మించిన భార్య
» అర్ధరాత్రి రామహేంద్రవరంలో అదృశ్యం- కాకినాడలో ప్రత్యక్షం
» నిజం నిగ్గు తేల్చిన పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చాలాకాలంగా పిల్లలు లేని ఒక మహిళ తన భర్త బాధ చూడలేక సినీ ఫక్కీలో గర్భం దాల్చినట్టు నాటకమాడింది. ఆ నాటకానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు మరో నాటకమాడి అడ్డంగా బుక్కైంది. ఈ సంఘటన రాజమహేంద్రవరంలో ప్రారంభమై కాకినాడలో ముగిసింది. రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ఏఎస్ఆర్ జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరుపేటకు చెందిన కొప్పిశెట్టి లోవరాజు కొప్పిశెట్టి సంధ్యారాణి భార్యభర్తలు. వీరికి వివాహమై 27 ఏళ్లయ్యింది. వారికి ఎంతకి పిల్లలు పుట్టకపోవడంతో కుటుంబీకులు చాలా బాధపడేవారు. చుట్టుపక్కల వారు కూడా గర్భం రావడంలేదని గుసగుసలాడుకోవడంతో ఆ బాధలు తట్టుకోలేక తనకు గర్భం వచ్చినట్టు కుటుంబ సభ్యులను నమ్మించింది. అప్పటి నుంచి భర్తతో నెలనెలా రాజమహేంద్రవరం వచ్చి జయ కిడ్నీ కేర్ ఆసుపత్రికి రావడం, లోపలికి వెళ్లి గర్భం రాకపోవడానికి కారణాలను డాక్టర్‌ను అడిగి రావడం, గర్భం వచ్చి బాగానే ఉన్నట్టు భర్తను నమ్మించేది ఈ క్రమంలో గత నెల 31న ఆసుపత్రికి వచ్చిన సంధ్యారాణి ఆసుపత్రిలోకి వెళ్లి బయటకు వచ్చి తనకు ఈనెల 3న డెలివరీ డేట్ ఇచ్చారని నమ్మించి ఇంటికి వెళ్లిపోయింది. ఈనెల 3న ఉదయం 11గంటలకు భర్తతో కలిసి జయ కిడ్నీ కేర్‌కు వచ్చి ఇక్కడ డెలివరీ నాటకం ఆడితే తెలిసిపోతుందని, భర్తకు కనిపించకుండా ఆసుపత్రి బయటకు వచ్చి తిరిగి ఇందుకూరుపేట వెళ్లి ఆటోలో కాకినాడ వెళ్లిపోయింది. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తనను ఎత్తుకుపోయారని, తనకు కవల పిల్లలు పుట్టారని, ఎవరో ఎత్తుకుపోయారని భర్తకు ఫోను చేసి మరో కొత్తనాటకం ఆడింది. అయితే ఆసుపత్రి వద్ద అదృశ్యమైన తన భార్య సంధ్యారాణి కనిపించడం లేదని లోవరాజు స్థానిక త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో త్రీటౌన్ సీఐ అప్పారావు, ఎస్ఐ షేక్ సుభాని అప్రమత్తమై కాకినాడలో ఎంక్వైరీ చేసి సంధ్యారాణిని పట్టుకున్నారు. అప్పుడు పోలీసుల విచారణలో వాస్తవాలు బయటకు వచ్చాయి. సంధ్యారాణికి అసలు గర్భమే రాలేదని, పిల్లల కోసం తన భర్త, కుటుంబ సభ్యులను నమ్మించడానికి నాటకం ఆడిందని తెలుసుకున్న పోలీసులు సంధ్యారాణికి ఆమె కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను కుటుంబానికి అప్పగించారు. అదృశ్యం కేసు నమోదు చేసిన గంటలో చాకచక్యంగా వ్యవహరించి ఛేదించిన త్రీటౌన్ సీఐ, ఎస్ఐలను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

వృద్ధుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

» జీవితంపై విరక్తితో కాలువలో దూకిన వైనం





వృద్ధుడిని ఒడ్డుకు చేర్చిన ఎస్ఐ శ్రీనునాయక్ (ఇన్‌సెట్లో) నీటిలో కొట్టుకుపోతున్న దృశ్యం

అనపర్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వయోభారంతో అనారోగ్యం వెంటాడడంతో జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు కాలువలోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అయితే 100 నెంబర్ ద్వారా కాల్ అందుకున్న పోలీసులు ఆ వృద్ధుడిని రక్షించారు. వివరాలిలా ఉన్నాయి... అనపర్తి ధరణికోటకు చెందిన సత్తి రామారెడ్డి వయోభారంతో అనారోగ్యం బారిన పడ్డాడు. కుటుంబ సభ్యులకు భారం కాకూడదనే ఆలోచనతో శుక్రవారం స్థానిక శివాలయం వద్ద ఎర్రకాలువ రేవులో దిగి ఆత్మహత్యకు యత్నించాడు. అయితే అతడు నీటిలో మునుగుతూ తేలుతుండడం చూసిన స్థానికులు వెంటనే 100 నెంబరు ద్వారా పోలీసుల విషయాన్ని తెలియజేశారు. దీంతో ఎస్ఐ శ్రీను నాయక్, స్టేషన్ రైటప్ శంకర్‌తో కలిసి నిమిషాల్లో కాలువ వెంబడి వెతుకుతూ 108కి సమాచారం అందించారు. స్థానిక బట్టీల వద్ద వృద్ధుడు కనిపించడంతో కార్మికులు ఒడ్డుకు చేర్చారు. వృద్ధుడికి సపర్యలు చేసిన పోలీసులు వివరాలు అడిగి తెలుకున్నారు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది అతడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి బంధువులకు సమాచారం అందించారు.

వైసీపీ అండతోనే మహిళలపై బ్లాక్ మెయిలింగ్

బీజేపీ మండలాధ్యక్షుడు బులిరెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో మహిళ అసభ్య వీడియోలు చిత్రీకరించి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ లైంగిక వాంఛ తీర్చాలని వేధించిన నల్లమిల్లి మణికంఠరెడ్డి వైసీపీ పార్టీ నాయకుడేనని బీజేపీ మండలాధ్యక్షుడు కర్రి బులిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి అన్నీ తానై పెత్తనం చెలాయిస్తూ మహిళలను లైంగికంగా వేధించిన వ్యక్తి మణికంఠరెడ్డి అని అన్నారు. గ్రామంలో అనేక మంది బాధితులు ఉన్నారని, మణికంఠ చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా బయట పడతాయన్నారు. ఇటువంటి వ్యక్తులే వైసీపీలో నాయకులుగా చెలామణి అవుతున్నారని, మణికంఠ వ్యక్తిత్వం ఐదేళ్ల పాటు తిప్పుకున్న వైసీపీ నేతలకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి వైసీపీ నేతలతో దిగిన ఫొటోలను మీడియాకు చూపారు. సమావేశంలో నల్లమిల్లి తాతారెడ్డి, కోనాల మణికృష్ణారెడ్డి, దుర్గారెడ్డి, వోగిరెడ్డి గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడపడం ప్రమాదకరం

గోకవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, అంతేకాకుండా చట్టరీత్యా నేరమని గోకవరం ఎస్ఐ వీఎన్‌వీ పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం దేవిచౌక్ సెంటర్‌లో వాహనదారులకు అవగాన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి మోటారుసైకిల్ నడుపుతున్న 14 వ్యక్తులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడ్డారని, వారిని కోర్టులో హాజరుపర్చగా 13మందికి ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున రూ.1,30,000 జరిమానా విధించగా మరో వ్యక్తి అధిక మోతాదులో మద్యం తాగడంతో మూడు రోజుల పాటు రిమాండు విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ వివరించారు. మద్యం తాగి వాహనం నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సారా స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సంజీవ్ నగర్‌లో ఓ ఇంటిలో సోదాలు చేసి 55 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని బర్ల సాయినాథ్ దుర్గా ప్రవీణ్, బుడ్డిగ దుర్గా ప్రసాద్ అనే వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ నార్త్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ త్రినాథ్ తెలిపారు.

కాపుల అభ్యున్నతికి పాటుపడాలి

కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు నరేష్

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవిచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి నియామకాలు జరిగాయి. రాజానగరం నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు కాళ్ల చక్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమలో రాజానగరం మండల కార్యదర్శిగా సలాది తాతయ్య నాయుడు, లాలాచెరువు పంచాయతీ కార్యదర్శిగా ఇంటి జయరాజాలను నియమిస్తూ రాజమండ్రి కాపునాడు అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు అధ్యక్షుడు గుదే రఘు నరేష్ మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి అందరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు విన్నా వాసు, రూరల్ అధ్యక్షుడు దేశినీడి రాంబాబు, మునగాల భాస్కరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: రాబిన్‌హుడ్
సూర్యమినీ	: ఏ మైన్ క్రాఫ్ట్ మూవీ
సూర్యప్యాలస్	: ఆర్య-2
స్వామి	: కోర్ట్
శివజ్యోతి	: రాబిన్‌హుడ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: వీర ధీర శూర
రాజా	: ----
ఊర్వశి	: ఎల్2 ఎంపురాన్
రంభ	: శారీ
మేనక	:28సి
అప్సర	: మ్యాడ్ స్క్వేర్
కుమారి	: ఆర్య-2
అశోక	: మ్యాడ్ స్క్వేర్
వీఎస్ మహల్(నామవరం)	: మ్యాడ్ స్క్వేర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: మ్యాడ్ స్క్వేర్
వెంకటసూర్య(కడియం)	: మ్యాడ్ స్క్వేర్
సత్యగౌరి (అనపర్తి)	: వృషభ, శివాజ్ఞ
సూర్యశ్రీ (అనపర్తి)	: మ్యాడ్ స్క్వేర్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఆర్య-2
రామకృష్ణ(కోరుకొండ)	: ----
గీతాసినిమాస్ (సీతానగరం)	: ----
శ్రీనివాస (గోకవరం)	: దిల్‌రూబా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కోర్ట్
లలితామహల్(రంపచోడవరం)	: ---
నవయుగ(చింతూరు)	: ----

బూరుగుపూడిలో మహిళలకు చీరల పంపిణీ

కోరుకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడిలో పాశాలమ్మ జాతర ముగింపు సందర్భంగా జరిగిన అన్న సమారాధన కార్యక్రమానికి విశ్వ హిందూ ధర్మ పరిరక్షన రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమానికి బియ్యాన్ని విరాళంగా అందించారు. లక్కీడ్రా ద్వారా 300 మంది మహిళలను ఎంపిక చేసి వారికి ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. మహిళలో హైందవ చైతన్యం తీసుకురావడం కోసం బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ గోకవరం మండలాధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు, పేరిన ప్రసాద్, అడపా నరసింహమూర్తి, అడబాల గణపతి, వెంకటేశ్వరరావు, పత్తారి నరసింహమూర్తి పాల్గొన్నారు.



అద్భుతః

- అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన
- వందలాది పెయింటింగ్స్, ఆకృతులు
- పెన్సిల్ ఆర్ట్ నుంచి సిలికాన్ విగ్రహాల వరకూ
- పలు రాష్ట్రాల నుంచి కళాకారులు
- కళలకు పునరుజ్జీవం : డిప్యూటీ స్పీకర్ రఘురామ
- కళాకారులకు పూర్వ వైభవం : మంత్రి దుర్గేష్

కళాకారుల సృజనాత్మకత కుంచెగా మారి జాలువారిన చిత్రాలు, ఆలోచనలకు రూపమిచ్చిన ఆకృతులతో, ఒడుపుగా రావి ఆకులో ఇమిడ్చిన స్వతంత్ర సమరయోధుల చిత్రాలు, కోడిగుడ్డు గుల్లలు, వేరుశనగ తొక్కలు.. ఇలా ఒకటేమిటి.. ఎన్నెన్నో వస్తువులతో జీవం పోసుకున్న కళారూపాలు.. మొత్తంగా అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఔరా! అనిపించింది. గోదావరి తీర నగరాన్ని పులకింపజేసింది. కళకు కాదేదీ అనర్హం అని నిరూపించింది. కళాకారులకు పూర్వ వైభవం తీసుకొచ్చే సదుద్దేశంతో రాష్ట్ర సాంస్కృతిక శాఖ రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేసిన ఈ వేడుకలో కళాకారులు తమ కళాఖండాలను ప్రదర్శించారు.

8



ఇటీవల తాము వేసిన వేషధారణలతో వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న రఘురామకృష్ణంరాజు, దుర్గేష్. పక్కన ఎమ్మెల్యే ఆదిరెడ్డి, తేజస్వి



రాజమహేంద్రవరంలో.. చిత్రకళా వీధిలో..



అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల, కలెక్టర్, ఎస్పీ తదితరులు



చిత్రకళా వీధిలో ప్రదర్శనలు.. సెంట్రల్ జైలు స్టాల్ వద్ద స్వాగతం





తన రక్తంతో గీసిన పవన్ చిత్రాన్ని రఘురామకు చూపిస్తున్న ఆర్టిస్ట్

కళ.. కళాకారులు

అయ్యో.. రొయ్యో..!



ఆక్వా చెరువులు... వనామీ రొయ్యలు పడుతున్న దృశ్యం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్వా రైతుల్లో వణుకు పుట్టిస్తున్నాడు. భారత్ సహా వివిధ దేశాల నుంచి అమెరికాకు ఎగుమతి సుంకాలు భారీగా పెంచుతున్నట్టు చేసిన ప్రకటనతో రొయ్యల ఎగుమతిదారులు కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. దాని ఫలితంగా ఆక్వా రైతులు పండించే ఉత్పత్తులపై తీవ్రమైన ప్రభావం పడింది. ఉత్పత్తి అయ్యే రొయ్యలను సైతం ఎగుమతిదారులు ధరలు తగ్గించి కొనుగోలు చేసే ప్రతిపాదనలు రైతులకు శరాఘాతంగా మారింది. ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఎగుమతి సుంకాలు పెంచేశారన్న ప్రచారం ప్రభావంతో భారత్‌లోనే అత్యధిక ఆక్వా ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోళ్లు నిలిపివేయడం వల్ల ధరలు గణనీయంగా తగ్గిపోయి రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. 50 కౌంట్ నుంచే అమెరికాకు రొయ్యల ఉత్పత్తుల ఎగుమతులు జరుగుతుంటాయి. అయితే దీన్ని సాకుగా తీసుకుని వంద కౌంట్ రొయ్యల ధరను భారీగా తగ్గించేశారు. కొన్ని రోజులపాటు ఆక్వా రైతులు, ఉత్పత్తులను పట్టుబడులు చేయడం నిలిపివేయాలంటూ కంపెనీలు ఆదేశించడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. అమెరికా సుంకాల భారాన్ని మోపడంపై వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

(అమలాపురం/మలికిపురం-ఆంధ్రజ్యోతి)

భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ముఖ్యంగా వనామీ రొయ్యపై ఎగుమతి సుంకం విధించడంతో ఆక్వా రైతులు పండించే రొయ్యల ఉత్పత్తులను కొన్నిరోజులపాటు నిలిపివేయాలన్న ఎగుమతిదారుల నిర్ణయం రైతులకు తీవ్ర ఆందోళన కలిగించింది. దాంతో కిలో రొయ్యలకు రూ.40 వరకు ఎగుమతి సుంకం పడుతుందనే పేరుతో రొయ్యల కొనుగోళ్లు నిలిపివేశారు. ఏప్రిల్ 15 నుంచి రొయ్యల ధరలు మరింత తగ్గుతాయనే ప్రచారానికి తెర లేపారు. దాంతో రొయ్యల రైతులు ఉత్పత్తి అయిన వాటిని అయిన కాడికి అమ్ముకోవడానికి సిద్ధమయ్యారు. వ్యాపారులు మాత్రం సిండికేట్ అయి నోరు మెదపడం లేదు. ఆర్డర్లు చెప్పడం లేదు. దాంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. అధిక సాగు ఉన్న కోనసీమలో తీరప్రాంత మండలాల నుంచి ప్రతీ రోజు వేలాది టన్నుల రొయ్యలు వివిధ కంపెనీలకు ఎగుమతి అవుతాయి. రాష్ట్రంలోనే పేరొందిన ప్రముఖ కంపెనీలు ఈ ప్రాంతం నుంచి రొయ్యల కొనుగోలు చేస్తాయి. ట్రంప్ పేరుతో తమపై ఎగుమతి సుంకం పడుతుందనే నెపంతో ఎగుమతిదారులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని, ప్రస్తుతానికి కొనుగోలు నిలిపివేసినట్టు చెబుతున్నారు. ప్రస్తుతానికి కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు తగ్గించి రొయ్యలు కొనుగోలు చేస్తున్నారు. ధరలు మరింత తగ్గుతాయని ప్రచారం చేస్తూ రైతులను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. 30 నుంచి 50 పైకౌంటు రొయ్యలు మాత్రమే అమెరికా, జపాన్ వంటి ఇతర దేశాలకు ఎక్కువగా ఎగుమతులు అవుతాయి. అయితే 80 నుంచి వంద కౌంటు వరకు రొయ్యలు ఎగుమతులకు పనికిరావని సాకుచూపి రేటు భారీగా తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వంద కౌంటు రొయ్యలు రూ.220 ధరకు కొనుగోలు చేస్తుండగా, 90 కౌంట్ రూ.230, 80 కౌంట్ రూ.250, 70 కౌంట్ రూ.270, 60 కౌంట్ రూ.300, 50 కౌంట్ రూ.330, 40 కౌంట్ రూ.360, 30కౌంట్ రూ.450 ధరలు ఉండగా ఇవి మరింత దిగజారే అవకాశాలు ఉన్నాయని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం రొయ్యల రైతులకు భరోసా కల్పించాలని, అత్యధిక విదేశీ మారకద్రవ్యం ఆర్జించే పెద్ద రంగం ఆక్వా కాబట్టి ప్రభుత్వం ఆక్వా రైతులకు బాసటగా నిలబడాలని ఆక్వా అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు త్సవటపల్లి నాగభూషణం పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తామన్న విద్యుత్ రాయితీలు వర్తింపచేయాలని, గత ప్రభుత్వంలో దారుణంగా పెంచిన రొయ్య ఫీడు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కొనుగోలుదారులతో చర్చించి రొయ్యలు కొనే ఏర్పాట్లు చేయాలని కోరారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆక్వా రైతుల్లోనూ ఇదే ఆందోళన నెలకొంది.

- ఆక్వా రంగంలో వణుకు పుట్టిస్తున్న ట్రంప్ ప్రకటన
- ఆక్వా రైతు నెత్తిన ఎగుమతి సుంకం పిడుగు
- ఆ సాకుతో రొయ్యల కొనుగోళ్లు ఆపేసిన ఎగుమతిదారులు
- కొన్ని రోజులపాటు కొనుగోళ్లు నిలిపివేయాలని నిర్ణయం
- విలవిల్లాడుతున్న రైతులు

జనసేనదే నిడదవోలు మున్సిపాలిటీ!

వైసీపీ కౌన్సిలర్ల వలసబాటతో మారిన సీను



జనసేన పార్టీలో చేరిన కౌన్సిలర్లతో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్టమొదటి మున్సిపల్ కౌన్సిల్ జనసేన ఖాతాలో పడనుంది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పురపాలక సంఘంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో జనసేన బలం అనూహ్యంగా పెరగడంతో ఇక ఆ పార్టీ కౌన్సిల్‌ను చేజిక్కించుకోవడమే మిగిలింది. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిడదవోలు పట్టణంలోని 28 వార్డులకు సంబంధించి 27 వార్డులను వైసీపీ కైవసం చేసుకోగా, ఒకేఒక వార్డులో తెలుగుదేశం గెలిచింది. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, మరో 11 మంది కౌన్సిలర్లు ఇప్పటిదాకా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో జనసేన కండువా కప్పుకున్నారు. నిజానికి ఈనెల 18వ తేదీకి నాలుగేళ్ల పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో కౌన్సిల్‌లో తమ బలాన్ని నిరూపించుకునేందుకు చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ గంగుల వెంకటలక్ష్మిలపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అనుమతి ఇవ్వవలసినదిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితలకు వైసీపీ కౌన్సిలర్లు పలువురు వినతిపత్రం అందించారు. కానీ ఈలోపు రాజకీయ పరిణామాలు మారిపోయాయి. వైసీపీ కౌన్సిలర్లు జనసేనలో వలసబాట పట్టారు. చైర్మన్, వైస్ చైర్మన్ తోపాటు 11 మంది చెందిన కౌన్సిలర్లు జనసేనలో చేరిపోయారు. దీంతో జనసేన బలం 13 మందికాగా, టీడీపీ కౌన్సిలర్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కందుల దుర్గేష్‌కు కౌన్సిల్‌లో ఓటు ఉండడంతో కూటమి బలం 15కు చేరింది. వైసీపీ కౌన్సిలర్ల వినతి మేరకు దీంతో ఈనెల 20వ తేదీన అవిశ్వాసం ప్రవేశపెట్టాల్సి ఉండగా, తాజా పరిణామాలతో ఈ అవకాశం లేనట్టుగా భావిస్తున్నారు. ఈలోపు తమ బలం నిరూపించుకునేందుకు జనసేన సన్నద్ధమవుతున్నట్టు సమాచారం.

వేడెక్కిన కౌన్సిల్ రాజకీయం

నిడదవోలు పురపాలక సంఘ కౌన్సిల్‌లో చైర్మన్ పదవిని వైసీపీ కైవసం చేసుకోవాలని రంగం సిద్ధంచేయగా, అవిశ్వాసాన్ని వీగిపోయేలా చేసేందుకు జనసేన పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. ఈ నేపథ్యంలో మొదటిగా చైర్మన్‌తోపాటు తొమ్మిది మంది కౌన్సిలర్లు జనసేనలోకి చేరగా, గత సోమవారం ఇద్దరు కౌన్సిలర్లు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. గురువారం మరో కౌన్సిలర్ జనసేన తీర్థం తీసుకోగా జనసేన బలం 12కు చేరుకుంది. శుక్రవారం మరో వైకాపా కౌన్సిలర్ ఆరుగొల్లు వెంకటేశ్వర్లు జనసేనలో చేరడంతో 13కు జనసేన బలానికి మరో టీడీపీ కౌన్సిలర్‌తో కలిపి 14కు చేరింది. మంత్రి దుర్గేష్‌కు కౌన్సిల్‌లో ఓటు హక్కు ఉండడంతో జనసేన బలం 15కు చేరుకుంది. దీంతో వైకాపా అవిశ్వాస తీర్మానానికి కూడా అర్హత లేకుండాపోయిందని సమాచారం.

ఆ ఇద్దరిదే వ్యూహం..

నిడదవోలు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ తోపరాల కళ్యాణ్‌చక్రవర్తి శింగవరం గ్రామానికి చెందిన పెన్మెత్స చందులు ప్రధానంగా మున్సిపల్ రాజకీయంలో చక్రంతిప్పారు. నిడదవోలు నియోజకవర్గంలోను, పట్టణంలోను జనసేనను బలోపేతం చేసే దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేసి జనసేన కౌన్సిల్ సాధించేలా విజయవంతంగా కథ నడిపించారు. ఇప్పటికే జనసేన పార్టీ నాయకుడిగా డాక్టర్ కళ్యాణ్ సేవలందిస్తుండగా, వైకాపాకు అన్ని విధాల అండగా ఉంటూ వచ్చిన పెన్మెత్స చందు మంత్రి దుర్గేష్ సమక్షంలో జనసేన తీర్థం తీసుకున్నారు. మున్సిపల్ వ్యవహారంలో వీరిద్దరినీ మంత్రి దుర్గేష్ అభినందించారు.



అఖండ గోదావరి ప్రాజెక్టు నేపథ్యంలో గోదావరి నదీ తీర ప్రాంతాల్లో, హేవలాక్ బ్రిడ్జి, బ్రిడ్జి లంక ప్రాంతాల్లో మంత్రి కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ ప్రశాంతి, మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ తదితరులు పర్యటించి పరిశీలన చేశారు.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం

రబీ ధాన్యం సేకరణకు నేటి నుంచి రైతు సేవా కేంద్రాలు : జేసీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): 2024-25 రబీ ధాన్యం సేకరణకు ఏప్రిల్ 5 నుంచి 216 రైతు సేవా కేంద్రాలు ప్రారంభిస్తున్నామని జేసీ చిన్నరాముడు తెలిపారు. 2 లక్షల టన్నులు వరి సేకరణ లక్ష్యమన్నారు. రైతులు తమ ధాన్యాన్ని 17శాతం తేమ వరకూ ఆరబెట్టుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని తమకు నచ్చిన మిల్లుకు పంపించే వెసులుబాటు ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంపై ఫిర్యాదులు, సందేహాలను తెలియజేయడానికి కంట్రోల్‌రూం ఏర్పాటుచేశామని, సెల్ నెం.8309487151లో సంప్రదించవచ్చని జేసీ తెలియజేశారు.

మృత్యువుతో పోరాడి..

7

- కిమ్స్ బొల్లినేని ఉద్యోగి లైంగిక వేధింపులతో ఫార్మాసిస్ట్ నాగాంజలి ఆత్మహత్యాయత్నం
- 13 రోజులపాటు చికిత్స పొందుతూ చివరకు కన్నుమూత

మాజీ ఎంపీ హర్షకుమార్‌పై కేసు నమోదు

12

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్



సమీక్షలో మాట్లాడుతున్న అజయ్ జైన్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్ నెం.9552300009పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై వారితో మాట్లాడి సంతృప్తి చెందే విధంగా చర్యలు ఉండాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జోనల్ ప్రత్యేక అధికారి అజయ్‌జైన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ప్రగతి, ప్రభుత్వ ప్రాధాన్యతలు, అమలులో సమస్యల పరిష్కారం, వ్యవసాయం, ప్రకృతి సాగు, పీఎం సూర్యఘర్, హౌసింగ్, పీఎం విశ్వకర్మ, ఎక్సైజ్, జీఎస్టీ, మునిసిపల్, పంచాయతీ రాజ్, పర్యాటకం తదితర అంశాలపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసే క్రమంలో క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకొని, వాస్తవ పరిస్థితికి అనుగుణంగా చర్యలు తీసుకున్నప్పుడే లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టిసారించడంతోపాటు సమస్యలు ఎదురైతే పరిష్కారాలు సూచించాలన్నారు. పర్యాటకపరంగా తూర్పుగోదావరిలో హోటల్స్ నిర్మాణాన్ని ప్రోత్సహించే క్రమంలో ఆసక్తి కలిగిన వారిని గుర్తించాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో 5వేల హోటల్ గదులు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందన్నారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచడంలో వాస్తవ పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యమన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 15శాతం జీవీఏ అభివృద్ధి దిశగా ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. వ్యవసాయ రంగంలో అంతర పంటలను, జిల్లాలో 47వేల ఎకరాల వరకూ ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ చిన్న రాముడు, మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన తొమ్మిది మందికి రూ. 2,01,479 వేల చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి నుంచి సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, కలగర సుబ్బారావు, కేవీకే రంగారావు, గారపాటి రామకృష్ణ, దాయన రామకృష్ణ, బీవీ ముత్యాలరావు, సుంకర సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎన్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు


కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించటంలో ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల యాజమాన్యం ముందుంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో లారెస్ ఫార్మా ల్యాబొరేటరీస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. దీనికి రాష్ట్రం నలుమూలల నుంచి 324 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 150 నుంచి 170 మందిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. లారెస్ ఫార్మా నుంచి వచ్చిన 20 మంది వివిధ విభాగాధిపతులు ఇంటర్వ్యూలు నిర్వహించి, తమ సంస్థ విధి విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అడ్వయిజర్ ఎన్‌వీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్, పీజీ డైరెక్టర్ సీహెచ్ చలపతి రావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె. సూరిబాబు, లారెస్ ఫార్మా ప్రతినిధి ఎం. ప్రకాష్, వివిధ కలాశాలలకు చెందిన బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీ. ఫార్మసీ, ఎం. ఫార్మసీ, డిప్లమా ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్, కండక్టర్లకు పురస్కారాలు అందజేత


ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందిస్తున్న డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపోలో 1340 లీటర్ల అయిల్ ఆదా చేసి డ్రైవర్ వైడి రాజు తోటి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారని డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ తెలిపారు. శుక్రవారం డిపోలో ఆయిల్ నిర్వహణలో ప్రతిభ కనబర్చిన డ్రైవర్, కండకర్లను అభినందించారు. ఇందులో డ్రైవర్ వైడీ రాజు ఉత్తమ డ్రైవర్‌గా ప్రథమస్థానంలో నిలిచారన్నారు. ద్వితీయ స్థానంలో జీఎస్ రావు, కండక్టర్స్ విభాగంలో ఎం. విజయ ఈపీకే 42.78 శాతం సాధించి ప్రథమస్థానం, ద్వితీయ స్థానంలో ఎండీ రఫీవుల్లా నిలిచారన్నారు. ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు డిపో మేనేజర్ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ శ్రీరామనవమిని పురస్కరించుకుని కొవ్వూరు డిపో నుంచి 5వ తేదీ మధ్యాహ్నం నుంచి భద్రాచలానికి స్పెషల్ బస్సులు నడుపుతున్నామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేత

ఉండ్రాజవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడిలో ఏపీ విశ్వహిందూ మహాసంఘ్ సోషల్ మీడియా కన్వీనర్ అమిరపు లక్ష్మణరావు తన తండ్రి అమిరపు గాంధీ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.లక్ష్మణరావు, అతని సోదరుడు రామసుబ్రహ్మణ్యం కలసి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో రజకచెరువు పూడికతీత పనుల్లో ఉన్న కూలీలకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, రామసుబ్రహ్మణ్యంను ఉపాధి కూలీలు అభినందించారు.

నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని బాబూ జగ్జీవన్‌రామ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు అన్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు మెయిన్‌రోడ్‌లోని హర్షిత లాడ్జి ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

కూటమి పాలనతో ప్రజలు సంతృప్తి

● డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఇతర నేతలు

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలు కూటమిపాలనతో సంతృప్తిగా ఉన్నారని, పోలవరం పూర్తయితే ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ ఇంటికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజును రాధాకృష్ణ గజమాలతో సత్కరించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రం ఊహించిన దాని కంటే తీవ్ర ఆర్థికమాంద్యంలో ఉన్నప్పటికీ సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని అసెంబ్లీలో చెప్పడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహనరెడ్డి చెప్పినవన్నీ మొదటి సంవత్సరంలో అందించలేదన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడానికి కొంత సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, టీడీపీ నాయకులు వేగి చిన్నా, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బీజేపీ నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, నీరుకొండ సూర్యనారాయణ, బూసి బెనర్జి, ఎస్. హారిక, పి. సర్వేశ్వరరావు, కరుటూరి జగన్, బీవీ ముత్యాలరావు, ఏపీఆర్ చౌదరి, నీరుకొండ వీరన్న చౌదరి, జనసేన నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కుమారదేవంలో ముగిసిన ఉగాది ఉత్సవాలు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి, ద్విసభ్య కమిటీ సభ్యులు, నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి) : కుమారదేవం గోదావరి ఏటిగట్టుపై వేంచేసియున్న గండి పోశమ్మ వారి ఆలయంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వెంకటలక్ష్మి పర్యవేక్షణలో సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, గొరిజాల సురేష్, సుంకవల్లి వెంకటేశ్వరరావు, యండపల్లి వీర్రాజు, గద్దె వాసు, కవిడి విస్సన్న, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం ఎంతో గొప్పది : కమిషనర్


ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాతృత్వం కన్నా .. దాతృత్వం ఎంతో గొప్పదని మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్ర కుమార్ అన్నారు. కొవ్వూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ సెక్రటరీ తోట అవినాష్ పెళ్లిరోజు పురస్కరించుకుని వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మరింతమంది దాతలు ముందుకు వచ్చి ప్రజలకు సేవలందించాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున బయటకు వచ్చే సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ ప్రజల దాహార్తిని తీర్చడానికి తమ ఇంటి ముందు కుండల్లో నీరు ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గరగ వరప్రసాద్, పుప్పాల సురేష్, శ్రీరంగం సత్యప్రసాద్, మద్దిరాల చిన సుందరరామయ్య శర్మ, గుళ్ళపల్లి రవి, అబ్దుల్ సూర్యప్రకాశరావు, పోకల రవి, ఆలపాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో జనసేనలో చేరిక


పార్టీలోకి మాజీ ఎంపీపీ సూరిబాబును ఆహ్వానిస్తున్న మంత్రి

నిడదవోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్ని వర్గాల వారికి ప్రాముఖ్యతనిస్తుండడంతో పార్టీ రోజురోజుకి బలోపేతం అవుతుందని ఆ పార్టీ నేత, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం రాజమండ్రిలోని మంత్రి నివాసంలో నిడదవోలు మాజీ ఎంపీపీ, బీసీ నేత మన్యం సూరిబాబు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సూరిబాబుకు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ బీసీ వర్గాల నుంచి మరింత మంది పెద్ద ఎత్తున జనసేనలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులపై 5 శాతం రిబేటు

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 267 ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు ఏక కాలంలో చెల్లించిన వారికి 5 శాతం రిబేటు కల్పించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ తెలిపారు. పురపాలక సంఘంలో పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పన్నులు చెల్లించడానికి ఈనెల 7వ తేదీ నుంచి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సెలవు రోజుల్లో కూడా పన్నులు కట్టించుకోవడం జరుగుతుందన్నారు. పన్ను చెల్లింపుదారులు పురపాలక సంఘంలో గానీ, వార్డు సచివాలయాల్లో గానీ లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చునన్నారు. చెక్కులు, డీడీలు నేరుగా పురపాలక సంఘ కార్యాలయంలో అందించి రశీదు పొందాలన్నారు.

సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో సికిల్‌సెల్ అనీమియా లక్షణాలు లేవని వైద్యాధికారి డాక్టర్ ఎస్. ధర్మరాజు తెలిపారు. ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం దొమ్మేరు, సావరంలో ఉన్న 28 మంది గిరిజనులకు (ఎస్టీ కులస్థులకు) కిట్ పరీక్ష ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎవరికీ ఎలాంటి లక్షణాలు కనిపించలేదన్నారు. సోమవారం మిగిలిన గ్రామాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సీహెచ్‌వో టీవీ లక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గోపాలపురం ఏఎంసీ చైర్మన్‌గా యద్దనపూడి


యద్దనపూడి బ్రహ్మరాజు

నల్లజర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం ఏఎంసీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత, ప్రకాశరావుపాలెం ఉప సర్పంచ్ యద్దనపూడి బ్రహ్మరాజు ఎంపికైనట్టు ప్రభుత్వం శుక్రవారం ఉత్వర్వు లు జారీ చేసింది. ఈయన 2014 నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుకు మద్దతిస్తూ పార్టీలో ఓ క్రియాశీల వ్యక్తిగా ఉన్నాడు. ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి బ్రహ్మరాజు స్నేహితుడు కావడం విశేషం.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

ఉండ్రాజవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో ధాన్య కొనుగోలు ప్రారంభించాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ధాన్యం సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు గోనెసంచుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. రైతులు పండించిన ధాన్యంతో పాటు పత్తిగింజలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఎస్ఎస్ రెడ్డి, కార్యదర్శులు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, వీఆర్వోలు, రైస్‌మిల్లర్లు, సొసైటీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు



ఉండ్రాజవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ యాక్షన్ ప్లాన్ కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపీడీవో వీఎస్ రామారావు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 15 గ్రామాల నుంచి వచ్చిన వారి దరఖాస్తులను పరిశీలించారు. ఆయా గ్రామాల దత్తత బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే


పార్టీ కార్యాలయంలో చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం ద్వారకా తిరుమలకు చెందిన వీసం లక్ష్మీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆమె ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ. 50 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును టీడీపీ కార్యాలయంలో అందించారు. ప్రస్తుతం ఆమె జంగారెడ్డి గూడెంలోని నిర్మల ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యర్నగూడెంలో 30 షాపులకు వేలం పాట


వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

దేవరపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెం పంచాయతీలో గల మూడు కాంప్లెక్స్‌ల పరిధిలోని 30 షాపులకు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఇందులో 90 మంది 10 వేలు చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. ఒక్కో షాపు నకు కాలపరిమితి 30 నెలలు ఉంటుందని పంచాయతీ కార్యదర్శి ఏ.అమ్మిరాజు తెలిపారు. ఈ వేలంలో నెలకు రూ. లక్షా 55 వేల 700 ఆదాయం లభిస్తుందని తెలిపారు. వైఎస్సార్ కాంపెక్స్‌లో గల 1వ నెంబర్ షాపుకు అత్యధి కంగా నెలకు రూ. 25,100 కు తాడి కనకదుర్గ పాట పాడుకున్నారు. కార్యక్రమంలో బొంతా భరత్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరశెట్టి రాజేంద్ర బాబు, టీడీపీ నాయకులు బొల్లిన విజయభాస్కర్, గద్దే శ్రీనివాస్, పంచాయతీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో భాగ్యవతి

గోపాలపురం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాలను బీఎల్‌వోలు కచ్చితంగా పాటించాలని ఓఎన్‌జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, గోపాలపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యవతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయపు సమావేశ మందిరంలో తహశీల్దార్ కే.అజయ్‌బాబు అధ్యక్షతన బీఎల్‌వోల సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రంలో మిగిలిన వారిని వేరే పోలింగ్ కేంద్రంలో చేర్పించటం లేదా నూతన పోలింగ్ కేంద్రానికి సిఫార్సు చేయాలన్నారు. ఎంపీడీవో డీఎస్ఎస్ శ్రీనివాస్, ఎలక్షన్ డీటీ సాంబశివరావు, డిప్యూటీ తహశీ ల్దార్ లక్ష్మీదేవి, సీనియర్ అసిస్టెంట్ రాజు, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. వివరాలివి.. ఆరికిరేవులకి చెందిన మట్టా చంద్రరావుకు భార్య కళావతి, కుమార్తె, కుమారుడు మట్టా చంద్రశేఖర్ ఉన్నారు. ఇందులో కుమార్తెకు వివాహం కాగా, అతని భార్య కళావతి హైదరాబాద్‌లో ఉంటోంది. కుమారుడు చంద్రశేఖర్ ఏపీ ఫైబర్‌నెట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం చంద్రరావు పొలంకి వెళ్లి సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చాడు. దీంతో ఇంటి లోపలికి వెళ్లి చూసేసరికి కుమారుడు మట్టా చంద్రశేఖర్ (23) ఫ్యాన్‌కు ఉరి పోసుకుని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వేగులయ్య కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. తమకు ఆసరాగా ఉంటాడను కున్న కొడుకు మృతిచెందడంపై తండ్రి బోరున విలపిస్తున్నాడు.

'వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును రద్దుచేయాలి'


నిడదవోలులో ముస్లిం సోదరుల మానవహారం

నిడదవోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లులోని అంశాలను ముస్లిం మైనార్టీలకు రాజ్యాంగం కల్పించిన వివిధ రాయితీలు, ప్రత్యేక హక్కులను హరించే విధంగా ఉన్నాయని, దీన్ని తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని నిడదవోలు పట్టణంలోని ముతవల్లీలు, ముస్లిం పెద్దలు ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం నిడదవోలు షాదీఖానాలో జరిగిన సమావేశంలో వక్ఫ్ బోర్డులోని పలు అంశాలను సవరిస్తూ తీసు కువచ్చిన ఉమీద్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని అన్ని మసీదుల ముతవల్లీల ఆధ్వర్యంలో గణపతి సెంటరులో మానవహారం నిర్మించి, డిప్యూటి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక నాయకులు, మసీదుల ముతవల్లీలు, ముస్లిం పెద్దలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అద్భుతః

● 'అమరావతి చిత్రకళా వీథి'లో ఆకట్టుకున్న వందలాది పెయింటింగ్స్, ఆకృతులు
● పెన్సిల్ ఆర్ట్ నుంచి సిలికాన్ విగ్రహాల వరకు ... చూసి ముగ్ధులైన ప్రజలు



తమ ప్రాజెక్టులతో ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులు





రాజమహేంద్రవరం /సిటీ, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన 'అమరావతి చిత్రకళా వీధి' ప్రదర్శనకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నుంచి కూడా కళాకారులు వచ్చారు. నగర కళాకారులతో పాటు కడప, శ్రీకాకుళం, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల వారు పెయింటింగ్స్, ఆకృతులను స్టాల్స్‌లో ఉంచారు. ప్రభుత్వాస్పత్రి దగ్గరనుంచి ఆర్ట్స్‌కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్స్ ఎక్రిలిక్, వాటర్ కలర్, పెన్, పెన్సిల్, నిబ్ పెయింటింగ్స్, చెక్క, మట్టి, కాగి తం, వాల్‌పుట్టి తదితర ముడిసరు కులతో చేసిన బొమ్మలతో నిండిపోయాయి. చిరుధాన్యాలతో చేసిన ప్రధాని మోదీ, తిరుమల వేం కటేశ్వరుని చిత్రపటాలు, మనిషిని పోలిన మనిషి విగ్రహాలు ఆశ్చర్యపరిచాయి. మహిళా ప్రత్యేక కారాగారంలోని ఉత్పత్తులు, కేంద్ర కారాగారంలోని ఖైదీలు వేసిన గాంధీజీ, తదితర పెయింటింగ్స్ ఆకర్షించాయి. కడపకు చెందిన ఈరయ్యా యోగి వేమన యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. ఆయన ఇసుకతో చిత్రపటాలు తయారుచేశారు. పాండిచ్చేరికి చెందిన నూర్జహాన్ టైలరింగ్ షాపులు, వస్త్ర తయారీ మిల్లుల్లో వచ్చిన రద్దుతో చేతి సంచులు, మహిళలకు హ్యాండ్ బ్యాగ్స్ రూపొందించారు. తిరుపతికి చెందిన బి.అర్చన నిర్మల్ పెయింటింగ్‌తో ఆకట్టుకు న్నారు. లైవ్‌ఆర్ట్‌లో కళాకారులు అక్కడికక్కడే పెన్, పెన్సిల్‌తో చిత్రాలు వేసి ఇస్తుండడం చాలామందిని ఆకర్షించింది. వారివారి చిత్రాలను వేయించుకుని మురిసిపోయారు. కొత్తపేటకు చెందిన రాజ్‌కుమార్ వడయార్ ఫ్యాబ్రిక్, సిలికాన్ మెటీరియల్‌తో చేసిన ప్రముఖుల విగ్రహాల వద్ద సెల్ఫీల హడావుడి కనిపించింది. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న అంబేడ్కర్, రాజా రవివర్మ, దామెర్ల రామారావు, ఆదికవి నన్నయ, తదితర విగ్రహాలను జనం ఆశ్చర్యంగా తిలకించారు. పెయింటింగ్స్, ఆకృతుల ఖరీదు బాగా ఎక్కువగా ఉండడంతో చాలామంది బేరమాడి వెనక్కు తగ్గారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కళాకారులను సత్కరించి ... ఈ ప్రభుత్వం కళాకారులకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ చిత్రకళా ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్పీ నరసింహ కిషోర్ బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 250 మంది సిబ్బంది, 6 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లను భద్రతా ఏర్పాట్లకు వినియోగించారు.


మినియేచర్ ఆర్ట్‌ని భూతద్దంలో తిలకిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి


రాజాధిరాజ, రాజమార్తాండ .... ఆకట్టుకున్న చిత్రం